



వైసీపీ నేతలు ఆక్రమించిన అటవీ పోరంబోకు భూమి

వైసీపీ నేతల భూకబ్జా!

- కంటేపల్లిలో అటవీ స్థలం ఆక్రమణ
- ప్లాట్లు వేసి విక్రయించేందుకు సన్నద్ధం
- గ్రామస్థుల ఫిర్యాదుతో స్పందించిన రెవెన్యూ
- ఆక్రమణల తొలగింపు.. హెచ్చరిక బోర్డు ఏర్పాటు



రెవెన్యూ శాఖ తొలగించిన ఆక్రమణలు

వెంకటాచలం, జూన్ 19 : మండలంలోని కంటేపల్లిలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ముఖ్య అనుచరుడు, వైసీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి వెలుబోయిన వెంకటేశ్వర్లు, మరికొందరు నాయకులు సర్వే నెం.287 లోని సుమారు 5 ఎకరాల అటవీ పోరంబోకు భూమిని ఆక్రమించారు. సదరు భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంపై గ్రామంలో పెద్ద దుమారమే రేగింది. ఆక్రమణకు గురైన భూమి గొలగమూడికి సమీపంలోని టూరిజం (ఐఐటీటీఎం) కళాశాలకు ఆనుకుని ఉండటంతో దాని విలువ సుమారు రూ.కోటి వరకు ఉంటుందని అంచనా. ఆక్రమణకు గురైన అటవీ పోరంబోకు భూమిలో కొంత స్థలంలో వైసీపీ నేత వెలుబోయిన వెంకటేశ్వర్లు అనధికారికంగా సిమెంటు బ్రిక్స్ కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు. మిగిలిన భూమిని వైసీపీ నేతలు అనధికారికంగా లే అవుట్‌గా మార్చి ప్లాట్లు వేసి అమ్మేందుకు ప్రయత్నించగా గ్రామస్థులు కనుగొని తహసీల్దారు పూర్ణచంద్రరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ శాఖ క్షేత్రస్థాయిలో విచారించి వీఆర్వో వినోద్ ఆధ్వర్యంలో పోలీసుల సహాయంతో జేసీబీ ద్వారా బుధవారం ఫెన్సింగ్, సిమెంట్ బ్రిక్స్ కర్మాగారాన్ని తొలగించారు. అంతేగాక హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు అందినకాడికి అందినట్లుగా దోచుకోవడమే కాకుండా ప్రభుత్వ భూములను ఆక్రమించారని, కంటేపల్లిలో చెరువులను, ప్రభుత్వ భూములను సైతం గ్రావెల్ కోసం కొల్లగొట్టి రూ.కోట్లలో దోచుకున్నారని గ్రామస్థులు మండిపడుతున్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ నేతలు దోచుకున్న రూ.కోట్ల ప్రభుత్వ సొత్తును తిరిగి కక్కించాలని వారు కోరుతున్నారు.

వైసీపీ నేత మైనింగ్ పరిశ్రమ సీజ్

- ఎస్‌ఎల్‌వీ స్టోన్‌క్రషర్స్‌కు రూ.1.32 కోట్ల జరిమానా
- 42,634 క్యూబిక్‌మీటర్ల మెటల్ సీజ్



సీజ్ చేసిన క్రషర్ వద్ద మైనింగ్ అధికారులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం) జూన్ 19 : గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు చేసిన అక్రమ మైనింగ్‌పై సంబంధిత అధికారులు జిల్లాలో వరుస దాడులు చేస్తున్నారు. వైసీపీ ముఖ్యనాయకుడు వైవీ రామిరెడ్డికి చెందిన ఎస్‌ఎల్‌వీ స్టోన్‌క్రషర్స్ మైన్స్‌పై అధికారులు దాడులు కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఎస్‌ఎల్‌వీ మైనింగ్ క్వారీలో అనుమతులకు మించి అక్రమంగా తవ్వకాలు జరిపినందుకు సుమారు రూ.75 కోట్ల జరిమానా విధించారు. తాజాగా రాపూరు మండలం పులిగిలపాడు వద్ద ఉన్న ఎస్‌ఎల్‌వీ స్టోన్‌క్రషర్స్ పరిశ్రమను, అందులో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.కోట్లు విలువైన మెటీరియల్‌ను మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసకుమార్ సీజ్ చేశారు. దాదాపు 42,634 క్యూబిక్‌మీటర్ల మెటల్ సీజ్ చేయడంతోపాటు రూ.1.32 కోట్ల జరిమానా విధించారు. ఇలా వరుస దాడులతో అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలు చేసిన వైసీపీ నాయకుల వెన్నులో వణుకు పుడుతోంది.

ఆదుకోండయా!

- కరువు బృందానికి అన్నదాతల మొర
- కలిగిరి, కొండాపురం మండలాల్లో పర్యటన
- దెబ్బతిన్న పంటల పరిశీలన, రైతులతో ముఖాముఖి

కలిగిరి/కొండాపురం, జూన్ 19 : తీవ్ర దుర్భిక్షంతో పంటలు ఎండిపోయి పూర్తిగా నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు కేంద్ర కరువు బృందానికి విజ్ఞప్తి చేశారు. గత రబీ సీజన్‌లో జరిగిన పంట నష్టాలను అంచనా వేసేందుకు కేంద్ర కరువు బృందం బుధవారం సాయంత్రం కలిగిరి, కొండాపురం మండలాల్లో పర్యటించింది. తొలుత కలిగిరి మండలంలోని గంగిరెడ్డిపాలెం, తెల్లపాడు గ్రామాల్లో దెబ్బతిన్న మినుము పంటను బృంద సభ్యులు పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాల్లో రైతులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను రైతులు కేంద్ర బృందం దృష్టికి తీసుకొచ్చారు. ప్రతి ఏడాది విత్తనాల కోసం పడుతున్న ఇబ్బందులు, నాసిరకం విత్తనాలతో నష్టపోయిన వైనాన్ని వివరించారు. గంగిరెడ్డిపాలెం పంచాయతీలో భూగర్భ జలం అడుగంటడంతో బోర్లు ఎండిపోయాయని పేర్కొన్నారు. తెల్లపాడు పంచాయతీలోని రైతులు తమకు ఉపాధి పనులు కల్పించాలని కోరారు. అలాగే, పంట నష్ట పరిహారం పూర్తిస్థాయిలో అందలేదని, ఈ విషయంపై అధికారులు రికార్డులు పరిశీలించాలని కోరారు. మెట్ట పైర్లే తమకు ఆధారమని, కరువు ప్రభావంతో తీవ్రంగా నష్టపోయామని, తాము పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి ఆదుకోవాలని కోరారు. రైతుల అభిప్రాయాలను సావధానంగా విన్న బృందం సభ్యులు పూర్తినివేదికను కేంద్రానికి అందజేసి ఆదుకుంటామని తెలియజేశారు.

● ఇక కొండాపురం మండలంలోని గొట్టిగుండాల గ్రామంలో దెబ్బతిన్న దాదాపు 80 ఎకరాల్లోని మినుము, మిరప పంటలను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో కేంద్ర కరువు బృందం సభ్యులు మన్నుజి ఉపాధ్యాయ్, మదన్‌మోహన్‌మౌర్య, అనురాధ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి, జిల్లా పౌరసరఫరాలాధికారి వెంకటరమణ, ఉద్యానశాఖాధికారి దీపిక, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్ వీరశేఖర్, కలిగిరి, కొండాపురం తహసీల్దార్లు బాలకృష్ణ, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.



కొండాపురం: గొట్టిగుండాల గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న కరువు బృందం



● ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలన

జిల్లాలో కరువు పరిస్థితులను వివరిస్తూ సమాచార శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం పరిశీలించింది. వ్యవసాయం, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పశుసంవర్థక శాఖలకు సంబంధించిన జరిగిన నష్టాలను ఆయా శాఖల అధికారులు ఫొటోలతో బృంద సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ లవన్న, జిల్లా వ్యవసాయశాఖాధికారి సత్యవాణి, పశుసంవర్థక శాఖ జేడీ మహేశ్వరుడు, నుడా వీసీ బాపిరెడ్డి, సీపీఓ రాజు, ఇరిగేషన్ డీఈఈ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ తిరుమల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరువు ఉంది..

కనికరించండి!

- పది మండలాల్లో తీవ్ర దుర్భిక్షం
- 9053.21 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- పశుసంపదకూ అపార నష్టం
- ఆర్థిక సాయం చేసి ఆదుకోండి
- కేంద్ర కరువు బృందాన్ని కోరిన కలెక్టర్



కేంద్ర బృందం సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్



కలిగిరి : గంగిరెడ్డిపాలెంలో రైతులతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

నెల్లూరు (హరనాథపురం), జూన్ 19 : జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో నెలకొన్న కరువు పరిస్థితుల దృష్ట్యా ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేయాలని కేంద్ర కరువు బృంద సభ్యులను కలెక్టర్ హరినారాయణన్ కోరారు. జిల్లాలో కరువు పరిస్థితులను అంచనా వేయడానికి విచ్చేసిన కేంద్ర బృంద సభ్యులు మన్నుజి ఉపాధ్యాయ్, ఎస్‌సి కష్యప్, మదన్ మోహన్ మౌర్య, బి. అనురాధ బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. సీతారామపురం, వలేటివారిపాలెం, కందుకూరు, లింగసముద్రం, కొండాపురం, కలిగిరి, దుత్తలూరు, మర్రిపాడు, వరికుంటపాడు, కలువాయి మండలాలను జాతీయ విపత్తుల సంస్థ కరువు మండలాలుగా ప్రకటించిందన్నారు. ఈ పది మండలాల్లో సాధారణ వర్షపాతం కన్నా తక్కువగా వర్షపాతం నమోదైందన్నారు. సీతారామపురంలో 50 శాతానికిపైగా, మిగిలిన 9 మండలాల్లో 30 నుంచి 40 శాతం మేర పంట నష్టం వాటిల్లిందన్నారు. ఈ పది మండలాల్లో 7,156 మంది రైతులకు చెందిన 9053.21 హెక్టార్లలో వరి, శనగ, వేరుశనగ, మినుములు, చిరుధాన్యాలు తదితర పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని వివరించారు. బాధితులను ఆదుకునేందుకు రూ.8.49 కోట్లతో ఇన్‌పుట్ సబ్సిడీ అంచనాలను కేంద్ర బృందానికి కలెక్టర్ వివరించారు. సీతారామపురంలో అత్యధికంగా 148 మంది రైతులు 69 హెక్టార్లలో పంటలు నష్టపోయారని వీరికి 9.25 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ అందించేందుకు అంచనా వేసినట్లు చెప్పారు. పశుసంవర్థక శాఖ పరిధిలో 7,42,306 చిన్న, పెద్ద పశునష్టం జరిగిందని, అయితే, ఎన్‌డీఆర్‌ఎఫ్ నిబంధనల ప్రకారం 5302 పశువులకు నష్టపరిహారం చెల్లించే అవకాశం ఉందన్నారు. ఈ మండలాల్లో పశుదాణా, మందుల కోసం రూ.2.91 కోట్ల బడ్జెట్ అవసరమని అంచనా వేసినట్లు వివరించారు. ఇక కరువు మండలాల్లో నీటి ఎద్దడిని అధిగమించేందుకు బోర్‌వెల్స్, సీపీడబ్ల్యూఎస్ స్కీమ్స్, వాటర్ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేసినట్లు చెప్పారు. జిల్లాలో 10 కరువు మండలాల్లో వ్యవసాయం, రూరల్ వాటర్ సప్లయ్, పశు సంవర్థక శాఖలకు సంబంధించి రైతులను ఆదుకునేందుక రూ.13.35 కోట్లు మేర నిధులు అవసరమని వివరించారు. జిల్లాలో వర్షాలు చెదురుమదురుగానే కురుస్తున్నాయని, రానున్న రెండు నెలలు ఇదే పరిస్థితి ఉంటే మెట్ట ప్రాంతల్లో తాగు, సాగునీటికి ఇబ్బంది కలుగుతుందని, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సి వస్తుందని వివరించారు. ఈ పరిస్థితులను దృష్ట్యా జిల్లాకు నిధులు మంజూరు చేయించేందుకు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని బృందాన్ని కలెక్టర్ కోరారు.

కార్పొరేటర్‌పై కేసు నమోదు

- బలవంతపు రాజీనామాలపై వలంటీర్ల ఫిర్యాదు



బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు

నెల్లూరు(క్రైం), జూన్ 19: నెల్లూరు నగరంలోని 41వ డివిజన్ కార్పొరేటర్ కోవాకొల్లు విజయలక్ష్మి, మధుసూదన్‌రావుతోపాటు పలువురు వైసీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వార్డు వలంటీర్ ఉద్యోగాలకు తమతో బలవంతంగా రాజీనామా చేయించారని పెనుబల్లి సంధ్యతోపాటు పలువురు వలంటీర్లు ఇచ్చిన ఫిర్యాదుతో కోర్టు ఆదేశాల మేరకు చిన్నబజారు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కాగా, ఎన్నికల సమయంలో వైసీపీ కార్పొరేటర్లు, నాయకులు తమపై దాడి చేసి, బెదిరించి, కులం పేరుతో దూషించి వలంటీర్ ఉద్యోగాలకు రాజీనామా చేయించారని నగరంలోని పలు పోలీసు స్టేషన్లలో బుధవారం ఫిర్యాదులు అందాయి. 19/1 సచివాలయంలో వలంటీర్‌గా పనిచేసిన శశికాంత్, మరికొందరు ఆ డివిజన్ వైసీపీ నాయకులపై బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైసీపీ క్లస్టర్ ఇన్‌చార్జులు ముడియాల రామిరెడ్డి, లక్ష్మీనారాయణ, పచ్చా రవి, బుల్లి కుమార్ తనను బెదిరించి బలవంతంగా ఉద్యోగానికి రాజీనామా చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదేవిధంగా 35వ డివిజన్ కార్పొరేటర్ యాకసిరి వాసంతి, శరత్‌చంద్ర తమను ఎన్నికల సమయంలో బెదిరించి ఉద్యోగాలకు రాజీనామా చేయించారని దర్గామిట్ట పోలీసులకు పలువురు మాజీ వలంటీర్లు ఫిర్యాదు చేశారు.

10 టీఎంసీలకు చేరువలో 'సోమశిల'

అనంతసాగరం : ఎగువ ప్రాంతం నుంచి ప్రవాహం కొనసాగుతుండటంతో సోమశిల జలాశయం నీటిమట్టం 10 టీఎంసీలకు చేరువైంది. మంగళవారం ఇన్‌ఫ్లో 891 క్యూసెక్కులు రాగా బుధవారం 4,433 క్యూసెక్కులకు పెరిగింది. నైరుతి రుతుపవనాలతో రాయలసీమ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు డ్యాంకు వచ్చే ఇన్‌ఫ్లో హెచ్చుతగ్గులుగా కొనసాగుతోంది. ఈక్రమంలో మరికొన్ని రోజులపాటు డ్యాంకు ప్రవాహం కొనసాగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా 9.373 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

బడి ఈడు పిల్లల కోసం

'నేను బడికిపోతా'!

- నెలరోజులపాటు జిల్లాలో నూతన కార్యక్రమం
- పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెంపుదలే లక్ష్యం

నెల్లూరు (విద్య), జూన్ 19 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే యోచనతో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం 'నేను బడికిపోతా' పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బడిఈడు పిల్లలందరూ బడిలో చేర్పించేలా సోమవారం నుంచి జులై 12వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గతంలో 14 ఏళ్ల లోపు వయసు కలిగిన బాలలను మాత్రమే నమోదు చేస్తుండగా ప్రస్తుతం 18 ఏళ్లలోపు వారి వరకు కూడా బడిఈడు పిల్లలుగానే గుర్తించి వివరాలు సేకరిస్తున్నారు. ప్రధానంగా 6-14 లోపు చిన్నారులు బడుల్లో చేరాల్సిన వారు బడి బయటే ఉంటున్నారు. తల్లిదండ్రుల్లో అవగాహనలోపం, చుట్టూ ఉన్న పరిస్థితుల కారణంగా చదువుపై పిల్లలు ఆసక్తి చూపడంలేదని వివిధ సర్వేల ద్వారా వెల్లడైంది. దీంతో టీడీపీ ప్రభుత్వం కొత్తదనంతో ఈ నెల రోజులపాటు చైతన్య కార్యక్రమాలు, ర్యాలీలు, సదస్సులు నిర్వహించి బడిబయట పిల్లలను బడికి రప్పించనున్నారు.

● మూడుస్థాయిల్లో నిర్వహణ

మూడు స్థాయిల్లో 'బడికి పోతా' కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ప్రధానంగా జిల్లా, మండల, గ్రామస్థాయిల్లో కమిటీలు ఏర్పడ్డాయి. జిల్లాస్థాయిలో డీఈఓ చైర్మన్‌గా, 13 మంది జిల్లాస్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. అలాగే, మండల, గ్రామస్థాయిలోనూ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ మూడు స్థాయిల్లో సమన్వయ సమావేశాల నిర్వహణ, పాఠశాలల్లో విద్యార్థులు అందుతున్న వసతులు, సంక్షేమ పథకాలు వివరణ, గోడపత్రికలు, వివిధ మాధ్యమాల ద్వారా ప్రచారం, ర్యాలీలు నిర్వహించడం, అమ్మఒడి, గోరుముద్ద, మధ్యాహ్న భోజనం, ఇతర సదుపాయాలపై తల్లిదండ్రులకు వివరిస్తారు. చివరి రోజున గుర్తించిన పిల్లలను యూడైస్‌లో నమోదు చేయడంతోపాటు పిల్లల సమగ్ర సమాచారాన్ని సేకరించి బడిలో చేర్పించేలా చర్యలు తీసుకుంటారు.



వింజమూరు : బడిలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

● జిల్లాలో 10వేల మందికి పైగానే..

జిల్లాలో ప్రతి ఏడాది పాఠశాలలు తెరిచే నాటికి వివిధ కారణాలతో పిల్లలు బడులకు రావడంపై ఆసక్తి చూపడం లేదని వివిధ సర్వేల ద్వారా తెలుస్తోంది. ప్రధానంగా ఐదో తరగతిలో ఉత్తీర్ణులైన వారు ఆరోతరగతి ప్రవేశాలకు వెళ్లక పోవడం, ఆరేడు తరగతుల తరువాత ఇంటికే పరిమితవుతున్నారు. ఇలా జిల్లాలో దాదాపు 10వేల మందికి పైగానే బడిబయట పిల్లలు ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

లక్ష్యాన్ని పూర్తి చేస్తాం!

ప్రభుత్వ లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నాం. అధికారులు, సిబ్బంది అందరి సహకారంతో గ్రామాల్లోని ఆవాస ప్రాంతాల్లో ప్రతి ఇంటిని సర్వే చేయించి బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేలా నేను బడికిపోతా ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ జరుగుతోంది. ప్రతిరోజూ దీనికి సంబంధించిన నివేదికలను జిల్లా కేంద్రానికి, జిల్లా నుంచి రాష్ట్ర కార్యాలయానికి అందచేస్తాము. వంద శాతం కార్యక్రమం విజయవంతం చేసేందుకు పని చేస్తున్నాం.

- సీహెచ్.ఉషారాణి, ఎస్ఎస్ఏ ఏపీసీ



వెంగమాంబ పేరంటాల ఆలయం

23 నుంచి వెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న వడ్డిపాలెంలోని వెంగమాంబ పుట్టినిల్లు

- 27 వరకు నిర్వహణ
- నర్రవాడలో విస్తృత ఏర్పాట్లు
- ప్రత్యేక బస్సులు నడపనున్న ఆర్టీసీ
- ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి తరలిరానున్న భక్తులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 19: భక్తుల కొంగుబంగారమై వెలుగొందుతున్న వెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నర్రవాడలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వారేకాక, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటకలతోపాటు ఇతర దేశాల్లో ఉన్న వారు సైతం ఏడాదికి ఓసారి జరిగే ఈ ఉత్సవాల్లో పాల్గొనడం ఆనవాయితీ. వెంగమాంబ ఉత్సవాల సీజన్ మొదలైదంటేచాలు ఉదయగిరి నియోజకవర్గంతోపాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉన్న ఉదయగిరివాసులు వారి స్వగ్రామాలకు చేరుకుంటారు. ఈ ఉత్సవాలకు సుమారు 7లక్షల మందికిపైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.

● అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే... !

వెంగమాంబ దయ ఉంటే అన్నీ ఉన్నట్టేనని భక్తుల విశ్వాసం. ఈ ఉత్సవాల్లో సంతానంలేని దంపతులెందరో వరపడడం పరిపాటి. అమ్మవారి సన్నిధిలో నిద్రిస్తే సంతానం భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. అమ్మవారి సొమ్మును పెట్టుబడిగా వినియోగించడం ఈ ప్రాంతీయులకు ఆది నుంచి వస్తున్న ఆచారం. ఆలయ కమిటీ నుంచి కొంత సొమ్మును రుణంగా పొంది ఆ నగదును లావాదేవీల్లో వినియోగిస్తే వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వృద్ధి చెందుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వెంగమాంబకు నిత్యపూజలు జరుగుతాయి. ఉత్సవాలతో నిమిత్తం లేకుండా భక్తులు ప్రతి ఆది, గురువారాల్లో అధికసంఖ్యలోనే అమ్మవారిని దర్శిస్తారు.



ప్రత్యేక అలంకరణలో వెంగమాంబ దంపతులు

● నిలుపుతో ఉత్సవాల ప్రారంభం

ఈనెల 23న నిలుపు, సంతానం లేని వారు వరపడుట, పసుపు దంచే కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 24న గ్రామోత్సవం, సంతానం లేనివారు వరపడుట, 25న గ్రామోత్సవం, 26న కల్యాణోత్సవం, పసుపు కుంకుమ ఉత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న బండ్లు తిరుగుట, పొంగళ్లు, రాష్ట్రస్థాయిలో ఎడ్ల బండలాగుడు పందేలతో ఉత్సవాలు ముగుస్తాయి.

నర్రవాడకు ప్రత్యేక సర్వీసులు

ఉదయగిరి, జూన్ 19: దుత్తలూరు మండలం నర్రవాడ వెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలకు 25 ప్రత్యేక బస్సు లు నడపనున్నట్లు ఉదయగిరి డిపో మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి, సీతారామపురం, పోరుమామిళ్ల నుంచి ఐదు చొప్పున, బద్వేల్ నుంచి 10 సర్వీసులు నడపనున్నట్లు ఆయన తెలిపారు. సాధారణ చార్జీలతోనే ప్రత్యేక సర్వీసులు నడుపుతామన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు



వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాల్లో తాగునీరు, వైద్య సదుపాయం, పారిశుధ్యం లాంటి కార్యక్రమాలతోపాటు 395 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. భక్తుల రాక కోసం వివిధ మార్గాల్లో 70 ప్రత్యేక బస్సులు నడపనున్నాం. అమ్మవారి దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. భక్తులంతా అమ్మవారిని దర్శించుకుని ఆమె కృపకు పాత్రులు కావాలి.

- వెట్టిగుంట ఉషశ్రీ, ఆలయ ఈవో

వెంగమాంబ హుండీల రాబడి రూ.12,05,440



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూన్ 19: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ హుండీలను బుధవారం లెక్కించారు. ఆలయ ఈవో వెట్టి గుంట ఉషశ్రీ ఆధ్వర్యంలో దేవదాయ ధర్మదాయ శాఖ కోవూరు డివిజన్ పరిశీలకుడు ఎం.సుధీర్ పర్యవేక్షణలో 2024 మార్చి 20 నుంచి 2024 జూన్ 19 వరకు హుండీలను లెక్కించగా రూ.12,05,440ల లక్షల రాబడి వచ్చింది. ఈ కార్యక్ర మంలో ఉప ప్రధాన అర్చకులు బీ పెద్దబ్రద్రయ్య, సీనియర్ అసిస్టెంట్ మహేష్ పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు : ఇద్దరికి స్వల్పగాయాలు



రాళ్ల గుట్టల్లోకి దూసుకెళ్లిన కారు

ఉదయగిరి రూరల్, జూన్ 19: మండలంలోని సర్వరాబాదు గ్రామ సమీపంలో 167బీజీ జాతీయ రహదారిపై బుధవారం కారు అదుపుతప్పి చెట్లలోకి దూసుకెళ్లిం ది. ప్రకాశం జిల్లా సింగరాయకొం డకు చెందిన కొంతమంది కావలి లో బీటెక్ చదువుతున్న విద్యార్థితో కలిసి కారులో భైరవ కోనకు బయలుదేరారు. సర్వరాబాదు గ్రామ సమీపానికి రాగానే కారు అదుపు తప్పి మార్జిన్ దాటి రాళ్ల గుట్టల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, కారు ముందుభాగం దెబ్బతింది. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైం), జూన్ 19: వేగంగా వస్తున్న బస్సు ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు... ఉదయగిరి నుంచి నెల్లూరు వస్తున్న ఆర్టీసీ బస్సు మంగళవారం సాయంత్రం సాలుచింతల జంక్షన్ వద్ద వస్తుండగా గుర్తుతెలియని వృద్ధురాలిని ఢీకొంది. దీంతో ఆమె అక్క డికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్ఐ గీతారమ్య ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల ఆరా తీయ గా వెంకటేశ్వరపురం పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో వృద్ధురాలు భిక్షాటన చేసుకుంటూ ఉంటుందని, ఆమెకు కుమారుడు ఉన్నాడని తెలిసింది. మృతదేహంపై పింక్ కలర్ నైటీ ఉందని, ఆమె వివరాలు తెలిసిన వారు నార్త్ ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు. వృద్ధురాలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	150
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	294
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6826
వెండి కిలో ధర	రూ. 90,700
వెండి ఒక గ్రాము	రూ. 92.70

ప్రజలకు, ప్రభుత్వానికి

వారధి రెవెన్యూ

- ఎంతో కీలకమైన శాఖ
- ప్రజలకు ఎన్నో రకాల సేవలు
- నేడు అధికారికంగా రెవెన్యూ దినోత్సవం
- ఏర్పాట్లలో అధికారులు, నాయకులు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 19 : ప్రభుత్వ శాఖల్లో కీలకమైనది రెవెన్యూ శాఖ. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఇది సేవలు అందిస్తోంది. ఆ శాఖ ఉద్యోగులు నిరంతరం ప్రజలతో మమేకమై వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాల మంజూరుతోపాటు భూ సంబంధ అంశాలు, ప్రజా పంపిణీ, ప్రకృతి విప త్తుల సాయం వంటి కీలక బాధ్యతలు నిర్వహి స్తున్నారు. రెవెన్యూ వ్యవస్థ 1780 జూన్ 20న ఏర్పాటైంది. పాలనా వ్యవహారాల్లో ఈ వ్యవస్థ అతి ముఖ్యమైనది. ఈ క్రమంలో రెవెన్యూ శాఖ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా జూన్ 20వ తేదీని రెవెన్యూ డేగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఎంతోకాలంగా ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చింది. దీంతో గత ప్రభుత్వం రెవెన్యూ దినోత్సవానికి మార్గదర్శకాలను నిర్దేశిస్తూ ఉత్తర్వులు ఇవ్వటమే కాక, గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది తొలిసారి రెవెన్యూ దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకోవడానికి రెవెన్యూ ఉద్యోగులు, ఉద్యోగ సంఘం నాయకులు సిద్ధమయ్యారు. రెవెన్యూ దినోత్సవం సందర్భంగా ఆ శాఖపై అవగాహన కల్పించిన, రెవెన్యూశాఖ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వివిధ స్థాయిల్లో సేవలందించిన రెవెన్యూ ఉద్యోగులు, ఆ శాఖలో పనిచేసి విరమణ పొందిన ఉద్యోగులను సత్కరించ నున్నారు. కమెండేషన్ సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు. మండల స్థాయి నుంచి ఈ సత్కార కార్యక్రమాలు ఉంటా యి. కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ రెవెన్యూ దినోత్సవ సంబరాలు జరుగనున్నాయి.



ఏపీఆర్ఎస్ఏ సమావేశం

జిల్లాలోని అన్ని డివిజన్ కేంద్రాల్లో ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహిం చాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా శాఖ నాయకులు తీర్మానించారు. బుధవారం నెల్లూరులోని ఏపీఆర్ ఎస్ఏ భవన్‌లో సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రతి డివిజన్ కేంద్రంతోపాటు, జిల్లా కేంద్రంలో రెవెన్యూ దినోత్స వాన్ని ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకు కలెక్టర్ హరినారాయణన్, జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్‌కు రెవెన్యూ డివిజనల్ అధికారులకు, రెవెన్యూ ఉద్యోగుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా కార్యదర్శి డేనియల్ పీటర్‌రావు, బీ మురళి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి

ఆదాల మోసగాడు

- పెద్ద మనిషి ముసుగేసుకున్న నయవంచకుడు
- వైసీపీ నాయకుడు వైవీ రామిరెడ్డి



లేఖ చూపుతున్న రామిరెడ్డి

నెల్లూరు రూరల్, జూన్ 19 : పెద్ద మనిషి ముసుగులో కనిపించే ఆదాల ప్రభాకర్ రెడ్డి మోసగాడని వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ వైవీ రామిరెడ్డి సంచలన ప్రకటన చేశారు. ఈ మేరకు బుధవారం మీడియాకు లేఖ విడుదల చేశారు. అందులో పలు ఆసక్తికర విషయాలు పేర్కొ న్నారు. అందరికీ పెద్ద మనిషిలాగా కనిపిస్తున్న ఆదాల నయవంచకుడని ఆరోపించారు. గడిచిన 16 నెలలుగా రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు, దుష్ప్రచారం చేయాలని తనపై ఒత్తిడి తీసుకువచ్చి చేయించాడని తెలిపారు. శ్రీధర్‌రెడ్డి వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా సోషల్ మీడియాలో వచ్చిన ఆరోపణలు, ప్రకటనల వెనక ఆదాలే ప్రధాన సూత్రధారి అన్నారు. ఈ విషయమై తాను ఆదాలకు అనేకసార్లు హితవు చెప్పినా వినలేదని తెలిపారు. రూ.2 కోట్లు ఖర్చుపెట్టి సోషల్ మీడియాలో శ్రీధర్‌రెడ్డిపై అసభ్యకరమైన ట్రోల్స్ నడపారని, 40 ఏళ్లుగా స్నేహితుడిగా ఉన్న శ్రీధర్‌రెడ్డిపై బురద జల్లడంలో తన పాత్రకూడా ఉన్నందుకు చింతిస్తూ బహిరంగ క్షమాపణ చెబుతున్నానని లేఖలో పేర్కొన్నారు. తన కోసం కష్టపడి పని చేసిన నాయ కులు, కార్యకర్తలను ఆదాల గాలికివదిలేసి పరార య్యాడని, అతడిని ఎవరూ నమ్మవద్దని కోరారు.

విద్యాసంస్థల వద్ద విజిబుల్ పోలీసింగ్

నెల్లూరు(క్రైం), జూన్ 19: జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల వద్ద విద్యార్థినుల రక్షణ, భద్రతే ధ్యేయంగా పోలీసులు బుధవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఆదేశాలతో జిల్లాలోని విద్యాసంస్థలు ఉదయం ప్రారంభమయ్యే సమయంలో, సాయంత్రం ముగిసిన తర్వాత పోలీసులు ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ విద్యార్థినులకు భరోసా కల్పించారు.



నెల్లూరులోని ఓ కళాశాల వద్ద పోలీసుల పహారా

పూజారి ఇంట్లో చోరీ

తోటపల్లిగూడూరు, జూన్ 19: మండలంలోని వరిగొండ పంచాయతీ దేవరాల మెట్టలో శ్రీ జ్వాలాముఖి అమ్మవారి దేవాలయంలో పూజారిగా పనిచేస్తున్న బొడ్డుపల్లి మోహన్‌రావు ఇంట్లో మంగళ వారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ జంపానీ కుమార్ తెలిపిన వివరాల మేరకు... ఇంట్లో ఎవరూలేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి లక్ష రూపా యల నగదు, మూడు సవర్ల బంగారం అపహరించి నట్లు మోహన్‌రావు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈమేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆయిల్ ట్యాంకర్ బోల్తా



బోల్తా పడ్డ ఇండియన్ ఆయిల్ కంపెనీ ట్యాంకర్

జలదంకి, జూన్ 19: మండలంలోని జలదంకి-జమ్మలపాలెం మధ్య జాతీయరహదారి మార్జిన్‌లో ఇండియన్ ఆయిల్ కంపెనీకి చెం దిన ఆయిల్ ట్యాంకర్ బుధవారం మధ్యాహ్నం బోల్తా పడింది. వివరాల మేరకు... జలదంకి-జమ్మలపాలెం మధ్య జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఆయిల్ లోడుతో వేగంగా వెళుతున్న ఇండియన్ ఆయిల్ కంపెనీకి చెందిన ట్యాంకర్ మార్జిన్‌లోకి రావడంతో మార్జిన్ కుంగి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్‌లకు ఎలాంటి గాయాలు కాలేదు. బోల్తా పడ్డ ట్యాంకర్‌లో ఆయిల్ ఉండడంతో అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉందని భావించిన స్థానికులు కావలి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన సంఘటనా స్థలంకు చేరుకున్న అగ్నిమాపక వాహనం ప్రమాదం జరిగిన పరిసర ప్రాంతమంతా నీటిని స్ప్రే చేసి అగ్ని ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. అనంతరం బోల్తాపడ్డ ట్యాంకర్‌ను క్రేన్‌లతో బయటకు తీశారు.

ఐదేళ్లు నిండిన బాలలు 1వ తరగతిలో చేరాలి

- ఎన్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ జూబిలీ పద్మనాభన్

అల్లూరు, జూన్ 19 : ఐదేళ్లు పూర్తి చేసుకున్న బాలలు ఒకటో తరగతిలో చేరేలా ఎన్‌సీఈఆర్‌టీ న్యూఢిల్లీ వారిచే రూపొందించిన విద్యాప్రవేష్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపట్టిందని ఎన్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ జూబిలీ పద్మనాభన్ అన్నారు. బుధవారం మండలంలోని ఇస్కపల్లి పట్టపుపాలెంలోని ప్రాథమిక పాఠశాలను సమగ్ర శిక్ష నెల్లూరు అకడమిక్ మానటరింగ్ అధికారి జి.సుధీర్‌బాబు, ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) పల్లిపాడు ఉపన్యాసకుడు కేవీ.జయచంద్రలతో కలసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ విద్యాకేంద్రం మైసూరు, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పటిష్టంగా చేపడుతున్నామన్నారు. ఒకటో తరగతి పిల్లల్లో సహజంగా ఉండే నైపుణ్యాలను, ఆటపాటల ద్వారా వెలికితీసి వారిలో ఉన్న సృజనాత్మకతను పెంపొందించడమే లక్ష్యమన్నారు. అల్లూరు మండలంలోని ఇస్కపల్లి, అల్లూరు పేట, నార్తుమోపూరు పాఠశాలలను ఈనెల 21వ తేదీ వరకు సందర్శిస్తామన్నారు. విద్యాప్రవేష్ కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎస్.సునీత, ప్రధానోపాధ్యాయుడు ఐ.చెంచుసుబ్బయ్య, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు పీ.నాగరాజారావు, సీహెచ్.గోపాల్, ఓ.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారుల బృందం

ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

నెల్లూరు (విద్య): వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లపాటు పాఠ్యపుస్తకాలు లేకుండానే మొక్కుబడిగా కొనసాగిన ఇంటర్ విద్యకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగులు ఇవ్వాలని నిర్ణయిం చింది. వీటిని జూలై 15వతేదీలోపు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జిల్లాలో 26 ప్రభుత్వ, 7 ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో అధిక శాతం పేద పిల్లలే చదువుకుంటున్నారు. గత ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు అందించకపోవడమేకాక అంతకు ముందు వరకు అమలులో ఉన్న మధ్యాహ్న భోజన పథకాన్నీ రద్దు చేసింది. దీంతో పేద విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సీనియర్లను అడిగి పాత పుస్తకాలు తీసుకుని చదువుకోవాల్సి వచ్చింది. తాజాగా మళ్లీ టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంటర్ విద్యార్థులకు గతంలో ఉన్న వసతులు పునరుద్ధరించాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లా ఇంటర్ బోర్డు అధికారులకు కూడా ఆదేశాలు అందడంతో ఎన్ని పుస్తకాలు అవసరమో ఇండెంట్ పంపించేలా చర్యలు తీసుకుంటున్నారు. పుస్తకాలు చేరిన వెంటనే సకాలంలో అందచేస్తామని అధికారులు తెలిపారు.

ఫిజియోథెరపిస్టు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), జూన్ 19 : జిల్లాలో ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లల కోసం నడుపుతున్న భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఫిజియోథెరపిస్టు పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేసేందుకు బీపీటీ, ఎంపీటీ అర్హత గల వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ సీహెచ్ ఉషారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఎస్ఎస్ఏ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తులు పొందాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 20 నుంచి 25వతేదీ సాయంత్రం 5 గంటలలోపు కార్యాలయంలో అందించాలని కోరారు.

ప్రభుత్వ వైద్య కళాశాల

హాస్టల్‌లో భారీ చోరీ

- మెడికోల ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, ట్యాబ్‌ల గల్లంతు
- సుమారు రూ.7లక్షల సొత్తు అపహరణ
- తెలిసిన వారి పనే అని అనుమానం
- పోలీసులకు ఫిర్యాదు

నెల్లూరు (వైద్యం), జూన్ 19 : నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాల బాయిస్ హాస్టల్‌లో బుధవారం భారీ చోరీ జరిగింది. మెడికోలకు చెందిన 8 ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, 3 ట్యాబ్‌లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఉదయం 6.30-7 గంటల మధ్య ఈ చోరీ జరిగినట్లు వైద్య విద్యార్థులు తెలిపారు. చోరీ జరిగినట్లు వెంటనే గుర్తించిన మెడికోలు ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా బుజబుజ నెల్లూరు వరకు వెళ్లారు. ఆ తర్వాత అపహరించిన ఫోన్లను నిందితులు ఆపేసినట్లు గ్రహించి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ జరిగిన సొత్తు విలువ సుమారు రూ.7లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. చోరీ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ వసుంధరాదేవి దృష్టికి తీసుకెళ్లారు.

పని చేయని సీసీ కెమెరాలు

ప్రభుత్వ వైద్య కళాశాల హాస్టల్‌లో 400 మంది దాకా మెడికోలు ఉన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎలాంటి రాగింగ్ జరగకూడదన్న ఉద్దేశంతో గదికి ముగ్గురు వంతున కేటాయించారు. ఫస్ట్‌ఫ్లోర్‌లో గదికి ఇద్దరు వంతున మూడో సంవత్సరం, ఫైనలియర్ మెడికోలకు కేటాయించారు. ఈ భవనంలో 4 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కారిడార్‌లో గదుల బయట మెడికోలు ఏమి చేస్తున్నారన్న నిఘా ఉంటుంది. అయితే ఎనిమిదేళ్లుగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో దొంగలు చేతివాటం చూపుతున్నారు. 2022లో ఇదే హాస్టల్‌లో రెండు ఫోన్ల చోరీ జరగ్గా పోయిన సొత్తును వెంటనే రికవరీ చేసి మెడికోలకు అప్పగించారు. కానీ, తాజాగా జరిగిన చోరీలో పెద్ద ఎత్తున వస్తువులు ఎత్తుకెళ్లారు. దీంతో అధికారులు వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.



చోరీ జరిగిన బాయిస్ హాస్టల్

ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఇదేనా!?

నెల్లూరు (క్రైం) : 'సార్.. మా హాస్టల్లోకి దొంగలు చొరబడి మొబైళ్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు దోచుకెళ్లారు' అంటూ పోలీసు స్టేషన్‌కు వెళ్లిన మెడికోలకు ఎదురైన చేదు అనుభవం ఇది. 'స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్, ఎస్ఐ, సీఐ ఎవరూ లేరు. వారు వచ్చేవరకు ఆగండి.' అంటూ గంటల సమయం కాలయాపన చేశారు. అంతకముందు వైద్య విద్యార్థులు 112కు ఫోన్‌చేస్తే ఇది తెలంగాణా అంటూ చెప్పడంతో నివ్వెరబోయారు. చివరకు ఓ విద్యార్థి తన బంధువుతో సిఫారసు చేయించడంతో చోరీ జరిగిన ప్రదేశానికి అధికారులు వెళ్లి పరిశీలించారు. అయితే, ఇన్‌స్పెక్టర్ సెలవులో ఉండటంతో అనేక చర్చల తర్వాత రాత్రి కేసు నమోదు చేశారు.

నిద్రపోతుంటే దొంగిలించారు



రాత్రి చదువుకుని తెల్లవారిన తర్వాత నిద్రలోకి జారుకున్నాం. ఆ తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు ల్యాప్‌టాప్‌లు, ఐ ఫోన్లు తీసుకెళ్లారు. ఇది గుర్తించి ఫోన్ సిగ్నల్ ఆధారంగా బుజబుజనెల్లూరు వరకు వెళ్లాము. ఆ తర్వాత ఫోన్ సిగ్నల్స్ ఆగిపోయాయి. పోలీసులకు ఫిర్యాదు చేశాము. హాస్టల్‌కు వచ్చే వారి పనే అయి ఉంటుందని అనుకుంటున్నాము. ఫోన్ పోవటం వల్ల కుటుంబ సభ్యులతో మాట్లాడే అవకాశం లేకుండా పోయింది.

- లక్షిత్ దీప్, బాధిత మెడికో

విచారణ చేపడుతున్నాం



బాయిస్ హాస్టల్‌లో చోరీపై పూర్తిస్థాయి విచారణ జరుగుతోంది. మెడికోలు పోలీసులకు ఫిర్యాదు చేశా రు. వాస్తవాలు త్వరలో బయటకు వస్తాయి. మెడి కోలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. పనిచేయని కెమెరాలను బాగుచేస్తున్నాం.

- డాక్టర్ వసుంధరాదేవి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

ఊరూరా వైభవంగా ఉత్సవాలు, జాతరలు


ఉదయగిరి రూరల్ : మేళతాళాలతో అమ్మవారికి పసుపు, కుంకుమ తీసుకెళుతున్న ఆలయ ధర్మకర్తలు, భక్తులు


ప్రత్యేక అలంకరణలో గంగాభవాని అమ్మవారు


ఉదయగిరి : విశేష అలంకరణలో అడవిపేరంటాలమ్మ

జ్యేష్ఠమాసం సందర్భంగా పలు మండలాల్లోని గ్రామాల్లో వివిధ దేవతామూర్తుల బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. రోజుకో అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిస్తున్నారు. అలాగే ఆయా గ్రామాల్లో ఉన్న గ్రామదేవతలకు కూడా గ్రామస్థులు జాతరలు, ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు వేలాదిగా పాల్గొని కానుకలు సమర్పించి, మొక్కులు చెల్లించుకుంటున్నారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహిస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో ఉత్సవాలు, తిరునాళ్లు ఈ వారంలోనే ప్రారంభం కానున్నాయి. ఆ వివరాలు..

వైభవంగా పసుపు, కుంకుమ ఉత్సవం

ఉదయగిరి రూరల్ : పట్టణంలోని బీసీ కాలనీ సమీపంలో వెలసి ఉన్న సంతానలక్ష్మి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పసుపు, కుంకుమ, ప్రదానోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు పిన్నెబోయిన వెంకటయ్య, రమణమ్మ ఇంటి నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమలను మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య ఆలయం వద్దకు చేర్చారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, విశేష అలంకరణలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతానంలేని మహిళలు ఆలయంలో వరపడ్డారు. రాత్రికి అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ప్రతిష్ఠించి, వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

కోదండరాముడి ఆలయ వార్షికోత్సవం

ఉదయగిరి పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న కోదండరామస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్లకు గణపతి పూజ, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. అనంతరం కల్యాణాన్ని నిర్వహించారు.

22 నుంచి గంగాభవాని ఉత్సవాలు

ఉదయగిరి మండలంలోని గంగిరెడ్డిపల్లిలో వెలసి ఉన్న అనంతపూరి గంగాభవాని ఉత్సవాలు ఈనెల 22 నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 22న సీతారాముల కల్యాణం, గ్రామోత్సవం, 23 ఉదయం వసంతోత్సవం, రాత్రికి గంగాభవాని నిలుపు, గ్రామోత్సవం, 24న అమ్మవారికి కుంకుమపూజ, గ్రామోత్సవ నిర్వహిస్తామన్నారు.ఈ సందర్భంగా ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు అన్నదానం ఉంటుందన్నారు.

అడవి పేరంటాలమ్మకు పసుపు, కుంకుమ

ఉదయగిరి : మండలంలోని గన్నేపల్లిలో బుధవారం అడవిపేరంటాలమ్మకు పసుపు, కుంకుమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పంచాయతీలోని గడ్డంవారిపల్లి, జెట్టివారిపల్లి, మిట్టపల్లి, కొట్టాలపల్లి, సర్వరాబాదు, కొట్టాలపల్లి బీసీ కాలనీల నుంచి భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ తీసుకొని వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం మొక్కులు తీర్చుకున్నారు. సంతానం కోసం మహిళలు వరపడ్డారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఆత్మారామస్వామికి వైభవంగా వ్యాలీ వాహనసేవ

సంగం : మండలంలోని అన్నారెడ్డిపాళెంలో ఆత్మారామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున స్వామివారు వ్యాలీ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆత్మారామస్వామిని వ్యాలీ వాహనంపై ఉంచి గజపూలమాలతో అలంకరించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవంగా ధ్వజారోహణ

సంగం మండలం దువ్వూరులో వెలసి ఉన్న గంగా,పార్వతి సమేత కోటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వైభవంగా ధ్వజారోహణ నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, మేళతాళాల మధ్య ఈ కార్యక్రమం జరిగింది. ధ్వజారోహణలో ప్రసాదంగా అందచేసే కొడిముద్ద కోసం భక్తులు ఎగపడ్డారు.

మాతాపరమేశ్వరికి డ్రైఫ్రూట్స్‌తో అలంకారం

సంగం తూర్పు దళితవాడలో జరుగుతున్న మాతాపరమేశ్వరి జాతరలో భాగంగా బుధవారం అమ్మవారికి డ్రై ఫ్రూట్స్‌తో అలంకరణ చేశారు. అలాగే ఆలయం ముందు ముగ్గుతో మాతాపరమేశ్వరి చిత్రాన్ని వేశారు. మూలవిరాట్‌ను పూలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి నృసింహుడి బ్రహ్మోత్సవాలు

కలువాయి: సోమశిల పరమానంద ఆశ్రమంలోని లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ఈనెల 26వతేదీ వరకు నిర్వహించనున్నట్లు అర్చక స్వాములు ఈదూరు రామాచార్యులు తెలిపారు. 20న అంకురార్పణ, 21న ధ్వజారోహణం, 22న హనుమంతసేవ, 23న గరుడ సేవ, 24న కల్యాణం, 25న వసంతోత్సవం, 26న ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు.


సంగం : వ్యాలీ వాహనంపై ఆత్మారామస్వామి గ్రామోత్సవం


కోటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించిన ధ్వజారోహణ


డ్రై ఫ్రూట్స్‌తో మాతాపరమేశ్వరికి అలంకారం


కలువాయి : బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన లక్ష్మీనృసింహుడి ఆలయం

మంత్రి ఆనంకు శుభాకాంక్షలు


మంత్రి ఆనంను కలిసి పుష్పగుచ్ఛం అందచేస్తున్న వెంకటేష్‌నాయుడు

సంగం, జూన్ 19: సంగం గ్రామవాసి, చెన్నై టీడీపీ ఫోరం, తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ విభాగం నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు నూతలపాటి వెంకటేష్ నాయుడు బుధవారం దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నెల్లూరులోని సంతపేటలో ఆయన ఇంట్లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందచేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంగం మాజీ మండల పార్టీ అధ్యక్షుడు నూతలపాటి శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం

ఆత్మకూరు, జూన్ 19 : పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 6.30 నుంచి 7.30 వరకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ పట్టణ అధ్యక్షుడు కరటంపాటి సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలకు అతీతంగా ఆత్మకూరు పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు, యోగసాధకులు పాల్గొనాలని ఆయన కోరారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

ఆత్మకూరు, జూన్ 19 : పౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఆత్మకూరు డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డీఎం కరిమున్నీషా తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు డిపో నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. మార్గమధ్యంలో కాణిపాకం, సిరిపురం గోల్డన్ టెంపుల్, అరుణాచలంలో గిరి ప్రదక్షిణ, దర్శనం ఉంటుందన్నారు. వెళ్లాలనుకునే భక్తులు రూ. 1400 చెల్లించి రిజర్వేషన్ చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 99592 25645, 99660 09395, 73828 83299 నెంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

భూఆక్రమణను అడ్డుకున్న అధికారులు

ఉదయగిరి రూరల్, జూన్ 19: మండలంలోని శకునాలపల్లి సచివాలయం వెనుక వైపు ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు అక్రమించేందుకు యత్నిస్తుండగా, బుధవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. 39, 40 సర్వేనెంబర్లలోని సుమారు మూడు ఎకరాల ప్రభుత్వ వాగు పోరంబోకు భూమిని కొందరు మట్టి తోలి అక్రమించేందుకు యత్నిస్తున్నారు. ఈ విషయంపై గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో వీఆర్వో అనూష సర్వేయరుతో వెళ్లి అడ్డుకున్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

వరికుంటపాడు, జూన్ 19: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, వరికుంటపాడు ఉన్నత పాఠశాలల్లో బుధవారం స్టూడెంట్స్ కిట్లను పంపిణీ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు, జడ్పీటీసీ సభ్యులు రావిళ్ల నాగేంద్ర చేతుల మీదుగా పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాంలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో షావుద్దీన్, హెచ్‌ఎం. చలపతి, వీరభద్రయ్య, సర్పంచులు మహేష్, దిలీప్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సికిలి సెల్ అనీమియా వ్యాధిపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సీతారామపురం, జూన్ 19 : ప్రపంచ సికిలిసెల్ అనీమియా డే సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు వైద్యాధికారి డాక్టర్ ఏ స్వప్న ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. వ్యాధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సికిలి సెల్ వ్యాధి గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయాసం, గుండెదడ, గుండె పెరుగుదల, ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులు వ్యాధి లక్షణాలని పేర్కొన్నారు. కావున మండలంలోని గిరిజనులంతా రక్త పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భవ్యశ్రీ, ఎంపీహెచ్ఈవో మజీద్, ఎంపీహెచ్ఎస్ రియాజ్, ఎంపీఎస్ క్రిష్టమ్మ, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వింజమూరులో హిందూ సామ్రాజ్య దినోత్సవం


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలు

వింజమూరు, జూన్ 19: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా పట్టణంలో బుధవారం హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద నుంచి బీసీ కాలనీలోని చౌడమ్మ గుడి వరకు బైక్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం ఆర్‌ఎస్ఎస్ నాయకుడు వాసు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీకి ఘన నివాళులు అర్పిస్తూ ఈ బైక్ ర్యాలీని నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆర్‌ఎస్ఎస్ కార్యకర్తలు, సానుభూతిపరులు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా'పై ఇంటింటా ప్రచారం

వింజమూరు, జూన్ 19 : మండలంలోని చౌటపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు కలిసి బుధవారం 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు కమిటీ చైర్‌పర్సన్ సుభాషిణి మాట్లాడుతూ గత ప్రభుత్వం జారీ చేసిన పాఠశాలల విలీనం జీవోను 117ను రద్దు చేసి, ఆయా పాఠశాలలను తిరిగి యథాస్థానంలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం. బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

అనంతసాగరం/ఉదయగిరి రూరల్, జూన్ 19: స్థానిక దిగువూరికి చెందిన ఉపాధ్యాయుడు చింతగుంట మధుసూదన్‌రెడ్డి (50) బుధవారం గుండెపోటుతో మృతిచెందారు. ఆయన ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేసేవారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.ఆయన మృతికి సంతాప సూచికంగా పాఠశాలకు సెలవు ప్రకటించారు.

తూర్పుబోయమడగలలో టీడీపీ సంబరాలు

వరికుంటపాడు, జూన్ 19: మండలంలోని తూర్పుబో యమడగల సచివాలయంలో బుధవారం టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ చిత్రపటాలను ఆవిష్కరించి సంబరాలు చేసు కున్నారు. తూర్పుబోయమడ గల, అలివేలుమంగాపురం గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు తమ స్వంత నగదు వెచ్చించి చిత్రప టాలను ఏర్పాటు చేయడంతో పాటు స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం నినాదాలతో హోరెత్తించారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుంద ని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

స్కూటీని ఢీకొన్న ఆటో : ఇద్దరికి తీవ్ర గాయాలు. ఒకరి పరిస్థితి విషమం

ఏఎస్ పేట,జూన్19: మండలంలోని మదారాబాదు వద్ద బుధవారం సాయంత్రం స్కూటీని ఆటో ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితుల కథనం మేరకు, అనుమసముద్రంకి చెందిన మామాఅల్లుళ్లు మహమ్మద్ హనీఫ్, నాసార్‌లు మదారాబాదులో టైల్స్ పనికి వెళ్లి సాయంత్రం స్కూటీపై తిరిగి ఇంటికి వస్తున్నారు. ఆ సమయంలో మదారాబాదుకి చెందిన శ్రీను ఆటోలో ఎదురుగా వచ్చి వారిని ఢీ కొట్టాడు.దీంతో మహమ్మద్ హనీఫ్, నాసార్‌లకు తీవ్ర గాయలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హనీఫ్ పరిస్థితి విషమంగా ఉంది. మెరుగైన చికిత్స కోసం ఆయన్ను నెల్లూరుకి తరలించారు.ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నిరాశపరుస్తున్న నైరుతి!

- మోస్తరు వర్షంతో మొహం చాటేసిన మేఘాలు
- మళ్లీ భానుడి విశ్వరూపం
- ఖరీఫ్ సాగుపై రైతుల ఆందోళన

కందుకూరు, జూన్ 19: ఈ ఏడాది సంవృద్ధిగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అంచనాలతో ఆనందించిన రైతులను నైరుతి రుతు పవనాలు నిరాశపరుస్తోన్నాయి. గత కొన్నేళ్లతో పోలిస్తే ఈ ఏడాది రుతు పవనాలు పది రోజులు ముందుగానే వచ్చినప్పటికీ ఆశించిన వర్షాలు కురవలేదు. ఈ నెల 8, 9 తేదీలలో రుతుపవనాల ప్రభావంతో ఓ మోస్తరు వర్షం కురిసి వాతావరణం చల్లబడినప్పటికీ భూములు పదునయ్యే వర్షం కురవకపోవడంతో రైతుల్లో ఆందోళన ప్రారంభమైంది. దీంతో పాటు గత నాలుగు రోజులుగా వేసవిని తలపిస్తూ భానుడు విశ్వరూపం చూపిస్తుండగా ఎండవేడికి తోడు వడగాలులు (పడమరగాలి) తోడవటంతో మలమలలాడుతున్న పరిస్థితి నెలకొంది. నైరుతి రుతుపవనాలు ముందుగానే పలకరించటంతో మంచి వర్షాలు కురిస్తే ఖరీఫ్ పైర్లు సాగుకు మంచి అదను అవుతుందని రైతులు ఆశగా ఎదురుచూశారు. పచ్చిరొట్ట పైర్లుతో పాటు నువ్వు, పెసర, మినుము, సజ్జ, జొన్న తదితర ఖరీఫ్ పైర్లు సాగు చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే అనూహ్యంగా వర్షాలు మొహం చాటేసి ఎండలు మండిపోతుండటంతో భూమిలో ఉన్న పదును కూడా పూర్తిగా ఆరిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో ఖరీఫ్ పైర్లు సాగు చేసేందుకు రైతులు వెనుకంజ వేశారు. వాతావరణం ఇలాగే ఉంటే విత్తనం మొలకెత్తడం కూడా అనుమానమేనని ఒకవేళ మొలిచినా వారం తిరగకుండానే మొలకలు ఎండిపోతాయని భావిస్తున్న రైతులు పైర్లు సాగు ఆలోచనను విరమించుకుంటున్నారు. అలాగే జీలుగ, జనుము, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట పైర్లు సాగు చేయాలన్నా భూమిలో ఉన్న పదును చాలదని రైతులు ఆలోచిస్తున్నారు. వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందించేందుకు సిద్ధం చేసినప్పటికీ వాతావరణ అనుకూల పరిస్థితుల్లో రైతులు వాటిని తీసుకునేందుకు తటపటాయిస్తున్నారు. మరోవైపు మే నెలలో కురిసిన ఓ మోస్తరు వర్షంతో నీటి ఆధారంగా సాగు చేసిన వేరుశనగ, పొద్దుతిరుగుడు లాంటి నూనెగింజల పైర్లు కూడా ఎండలధాటికి మలమలలాడుతుండటంతో ఆ పైర్లు సాగుచేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం మరో వారం పది రోజులు ఇలాగే కొనసాగితే ఇక ఖరీఫ్ పైర్లు సాగుపై ఆశలు వదులుకోక తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆతర్వాత వర్షాలు కురిసినా అదను దాటుతుందని వాపోతున్నారు.

మందాడి చెరువులో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు!

- బోర్డులతో సరిపెడుతున్న అధికారులు

కావలి, జూన్ 19: కావలి పట్టణం మందాడి చెరువు లోతట్టు ప్రాంతంలో ఉన్న రాళ్లగుట్ట పోరంబోకు స్థలంను పలువురు ఆక్రమించి యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. రోడ్డు పక్కనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోకుండా ఎవరైనా ఫిర్యాదు చేసిన రోజు అధికారులు హడావుడి చేసి అక్కడ ఇది ప్రభుత్వ స్థలమని బోర్డులు పెడుతున్నారు. గతంలో అనేక పర్యాయాలు బోర్డులు పెట్టినా అవి కొన్ని రోజులకు మాయమవడం.. ఆ తర్వాత నిర్మాణాలు చేపట్టడం పరిపాటిగా మారింది. ఇదే క్రమంలో ఆ చెరువులో మళ్లీ నిర్మాణాలు జరుగుతుండగా తాజాగా అక్కడ ప్రభుత్వ భూమి అని, దీనిలోఎవరూ ప్రవేశించరాదని ఆక్రమించరాదని, అక్రమించిన చో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు పేరుతో బుధవారం ఒక బోర్డు ప్రత్యక్షమైంది. అయితే ఇప్పటి వరకు ఆ స్థలాలను వైసీపీ ప్రభుత్వంలో కొందరు వ్యక్తులకు, కొన్ని సంస్థలకు అనధికారికంగా అప్పచెప్పారనే ప్రచారం జరిగింది. అప్పట్లో అక్కడ నిర్మాణాలు ప్రారంభిచగా ఎన్నికల సమయంలో అధికారులు వాటి నిర్మాణాలను నిలిపి వేశారు. ప్రస్తుతం అది ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టడంతో చెరువులో నిర్మాణం జరిగేవి అక్రమ నిర్మాణాలని తేలిపోయింది. అయినా ఒక నిర్మాణం వద్ద ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టి ఉన్నా సమీపంలో మరొక నిర్మాణం చేసిన రేకుల షెడ్డు గోడలకు ప్లాస్టింగ్ చేస్తూనే ఉన్నారు. కేవలం అధికారులు కాలయాపనతో సరిపెడుతున్నారే కానీ ప్రభుత్వ భూమని చెప్పినా అక్కడ నిర్మాణలను మున్సిపల్ అధికారులు తొలగించకుండా వదిలి వేస్తుండటంతో అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి.


మందాడి చెరువులో నిర్మిస్తున్న భవనాల వద్ద ప్రభుత్వ స్థలమని ఏర్పాటు చేసిన బోర్డు

ఇంటూరికి అభినందనల వెల్లువ


ఇంటూరి నాగేశ్వరరావుకు అభినందనలు తెలుపుతున్న బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

కందుకూరు, జూన్ 19: కందుకూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఇంటూరి నాగేశ్వరరావును బుధవారం పలువురు కలిసి అభినందనలు తెలిపారు. కందుకూరు బ్రాహ్మణ సంఘం ప్రతి నిధులు ఐవీ నాగరాజారావు ఆధ్వర్యంలో బడేవారిపాలెం వెళ్లి నాగేశ్వరరావును కలిసి ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో శరత్ బాబు, నాగరాజు, సురేష్, తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం కార్యాలయంలో ప్రజలు, కందుకూరు నియోజకవర్గంలో పోస్టింగ్‌లు ఆశిస్తున్న వివిధశాఖల అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఇంటూరి నాగేశ్వరరావు కావలికి వెళ్లి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'నేను బడికి పోతా'పై అవగాహన ర్యాలీ



కొండబిట్రగుంటలో నిర్వహిస్తున్న ర్యాలీ

బిట్రగుంట, జూన్ 19: బోగోలు మండలం బిట్రగుంట పంచాయతీ కొండబిట్రగుంట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్దులూరి ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో బుధవారం నేను బడికి పోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలు పునః ప్రారంభిచడంతో ప్రభుత్వ పాఠశాల్లో పిల్లలు చేర్పిం చేందుకు విద్యార్థులచే చేపట్టిన ర్యాలీలో ఎంఈవోలు నరసింహారావు, జయమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 11 మంది బడిఈడు పిల్లలను బడిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని విజిత, పెరుమాళ్లు, అంకారావు, శ్రీకాంత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'నేను బడికిపోతా'పై నేడు సమీక్ష

అల్లూరు : నేను బడికిపోతా కార్యక్రమంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరరంలో గురువారం సమీక్ష నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జ్యోతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై విద్యార్థులను బడికి పంపించే అంశంపై సమీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు, రూరల్, అర్బన్ పంచాయతీలకు సంబంధించిన కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

అక్రమ లేఅవుట్లలో ముమ్మర సర్వే

- బయట పడుతున్న ప్రభుత్వ భూములు


రోడ్డుకు అడ్డంగా వచ్చిన పంట కాలువకు మార్కింగ్ చేస్తున్న సర్వే టీం సభ్యులు

కావలి, జూన్ 19: కావలి పట్టణంలో వేసిన అక్రమ లేఅవుట్లలో తవ్వే కొద్దీ అవినీతి బయట పడుతోంది. కావలి పట్టణం వెంగాయగారి ప్రాంతంలో బుధవారం మూడు టీమ్‌లు అక్రమ లేఅవుట్లలో సర్వే చేపట్టారు. వాటిలో రెండు టీమ్‌లు సుమారు 15 సర్వే నెంబర్లలో 35 ఎకరాల వరకు సర్వే పూర్తి చేశారు. వీటిలో మూడు సర్వే నెంబర్లలో 4.33 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి మార్కింగ్ చేశారు. వాటిలో 52 సెంట్లు ప్రభుత్వ కాలువ, 3.81 ఎకరాలు రెండు నీటి గుంటలను గుర్తించారు. 4.33 ఎకరాలు ప్రభుత్వ స్థలంగా గుర్తించి వాటికి మార్కింగ్ చేశారు. మరొక టీమ్ చేసిన సర్వే వివరాలు తెలియరాలేదు. మొత్తం మీద అక్రమ లేఅవుట్లలో తవ్వే కొద్దీ ప్రభుత్వ ఆస్తులు బయటపడుతుండటంతో వాటిల్లో ప్లాట్లు కొన్న వారు ఆందోళన చెందుతున్నారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కావలిటౌన్, జూన్ 19: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. వక్తలు మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం కల్పించేందుకు రాహుల్ గాంధీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచి వెంకటేశ్వర్లు, వీరబ్రహ్మం, రవిబాబు, గురవయ్య, యువజన నాయకులు నితీష్ పాల్గొన్నారు.

ఫ్యాను, లైట్లు వితరణ

బిట్రగుంట, జూన్ 19: బోగోలు మండల హౌసింగ్ కార్యాలయంలో గత కొన్ని నెలలగా ఫ్యాన్, ట్యూబ్‌లైట్లు కాలిపోయి సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో బుధవారం రాగాల పావని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఫ్యాను, లైట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బోగిరి ప్రభాకర్, ట్రస్ట్ సభ్యులు గండే మధు, ముల్లా పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

కందుకూరు, జూన్ 19: డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో పట్టణంలోని శ్రీగాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ రామకృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ విభాగంలో మేడిద శిరీష 91శాతం, కొత్తమాసు గీతికాలక్ష్మి, కమలాశ్రీలు 89శాతం, బీకాం (కంప్యూట ర్స్)లో కుంచాల సుష్మ 89 శాతం, షేక్ ఆసియా 88శాతం, బీకాంలో తలతోటి దివ్య 73శాతం, బీఏలో బిల్లా మహేష్ 80శాతం మార్కులు సాధించారని తెలిపారు. బీకాం (కంప్యూటర్స్)లో 96శాతం, బీకాంలో 95, బీసీఏలో 90, బీఏలో 94 ఉత్తీర్ణత సాధించారని వివరించారు.

నాట్యకారిణులకు ఎమ్మెల్యే కృష్ణారెడ్డి అభినందనలు

కావలిటౌన్, జూన్ 19: మహారాష్ట్ర పూణెలోని జగన్నాథ ఆలయంలో నాట్య ప్రదర్శన ఇచ్చి తిరిగి వచ్చిన కావలికి చెందిన ఉమామహేశ్వరరావు శిష్య బృందాన్ని బుధవారం ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి అభినందించారు. పూణెలో ఉత్తమ ప్రదర్శన అందించిన చిన్నారులకు అక్కడి నిర్వాహకులు అందించిన ప్రశంసాపత్రాలు షీల్డులను ఎమ్మెల్యేకు చూపించి ఆయన ఆశీర్వాదం అందుకున్నారు. కావలి చిన్నారులు ఇతర రాష్ట్రాల్లో ఉత్తమ ప్రదర్శన అందించి ప్రశంసలందుకోవడంతోపాటు కావలికి మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని చిన్నారులకు కళామతల్లి ఆశీర్వాదం కలగాలని అభిలషించారు.

ఎమ్మెల్యేకు పలువురి సత్కారం

ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డిని బుధవారం పలువురు అధికారులు, వైశ్యప్రముఖులు, పట్టణ ప్రజలు కలిసి సత్కరించారు. అటవీశాఖ అధికారులు, పలు ప్రైవేట్ బ్యాంకుల అధికారులు, సిబ్బంది, నవోదయ, శుభోదయ క్లాత్‌మార్కెట్ వ్యాపారులు ఇంకా పలువురు పట్టణ ప్రజలు కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

చిన్నారి వైద్యం కోసం ఆర్థిక సాయం

కందుకూరు, జూన్ 19: కందుకూరు పట్టణంలోని పోతురాజుమిట్టసెంటర్‌కు చెందిన మూడేళ్ల చిన్నారి అరుదైన వ్యాధితో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం దాతల సహకారం అర్థించిన నేపథ్యంలో పట్టణంలోని పామూరు రోడ్డులో ఉన్న కందుకూరు-2 పొగాకు వేలం కేంద్రం అధికారులు, సిబ్బంది, రైతులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. వేలం నిర్వహణాధికారి రాజగోపాలరెడ్డి ఆధ్వర్యంలో బోర్డు సిబ్బంది, బయ్యర్లు, పలువురు రైతులు కలిసి రూ.51,111 ఆర్థికసహాయం అందించారు. నిరుపేద కుటుంబాలకు ఆపద సమయంలో ప్రతి ఒక్కరూ మానవతను చాటుకోవాలని పలువురు రైతులు విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో కంపెనీల ప్రతినిధులు గుమ్మా వెంకటరావు, కేశవ, పోలయ్య, రమేష్, ఇంటూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

గుడ్లూరు, జూన్ 19 : మండలంలోని సాలిపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుధవారం కర్లపాలెం గ్రామ సర్పంచు చాపల రమణయ్య ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, ప్యాడ్, పెన్నులు, పలకలతో కలిపిన కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కె.శ్రీనివాసులు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని గంగాభవాని, ఎం.గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

కావలి, జూన్ 19: పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (అప్‌కాస్ట్) నెల్లూరు జిల్లా సమన్వయకర్త జీ వెంకటరమేష్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ మాసోత్సవాల్లో భాగంగా కావలి రూరల్ మండలం రామచంద్రాపురం పాఠశాలలో బుధవారం విద్యార్థులచే మొక్కలు నాటించారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణం మనందరి బాధ్యత అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు మొక్కలు, సైన్సు పుస్తకాలు, ప్రశంసా పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.సుధాకర్, ఉపాధ్యాయులు పువ్వాడి వెంకటేశ్వర్లు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

కందుకూరు కేవీకేలో ఆరుగురు శాస్త్రవేత్తల నియామకం

కందుకూరు, జూన్ 19: కందుకూరు సీటీఆర్ఐకు అనుబంధంగా ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)కు శాశ్వత ప్రాతిపదికన ఆరుగురు శాస్త్రవేత్తలను నియమించారు. న్యూఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధన మండలి ఈ మేరకు ఒకేసారి వివిధ విభాగాలకు చెందిన ఆరుగురు శాస్త్రవేత్తలను నియమించటంతో వారంతా బాధ్యతలు స్వీకరించారు. సస్య ఉత్పత్తి విభాగంలో డాక్టరు జ్యోతి, సస్యరక్షణ విభాగంలో డాక్టరు వెంకటేష్, ఉద్యానవన విభాగంలో డాక్టరు మయాంక్, పశువిజ్ఞాన విభాగంలో డాక్టరు శ్రీరంగ, గృహ విజ్ఞాన విభాగంలో డాక్టరు నిహారిక, వ్యవసాయ యాంత్రీకరణ విభాగంలో వివేక్ కామత్‌లు బాధ్యతలు స్వీకరించారని కేవీకే హెడ్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జి.ప్రసాద్‌బాబు తెలిపారు.


కేవీకే హెడ్‌తో బాధ్యతలు చేపట్టిన శాస్త్రవేత్తలు

ప్రజల మేలు మర్చిపోను

● అమృత లింగేశ్వరస్వామికి సోమిరెడ్డి పూజలు



స్వామి వారిని దర్శించుకుంటున్న సోమిరెడ్డి దంపతులు

తోటపల్లిగూడూరు, జూన్ 19: మండలంలోని మాచర్లవారిపాలెం పంచాయతీ పరిధిలోని నక్కావారిపాలెంలో శ్రీకామాక్షి సమేత శ్రీఅమృత లింగేశ్వరస్వామిని బుధవారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి జ్యోతి దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన సందర్భంగా ఆయన మాచర్లవారిపాలెం టీడీపీ నేత పొన్నలూరు శివకోటారెడ్డి ఆధ్వర్యంలో 1200 టెంకాయలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ కష్టపడి పని చేసిన నాయకులు, కార్యకర్తలు, ప్రజల మేలును మర్చిపోను అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ముత్యాల శ్రీనివాసులు, ముస్లిం మైనార్టీ నేత షేక్ అల్తాఫ్‌బాష, నాయకులు కొణతం రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతాం : శృతిరెడ్డి

పొదలకూరు : మండలంలోని సమస్యలకు రానున్న ఐదేళ్లలో శాశ్వత పరిష్కారం చూపుతామని చంద్రమోహన్‌రెడ్డి కోడలు సోమిరెడ్డి శృతిరెడ్డి అన్నారు. బుధవారం ఆమె పొదలకూరులో పర్యటించారు. తొలుత పోలీస్‌స్టేషన్ వద్ద నున్న విఘ్నేశ్వరస్వామి గుడిలో పూజలు నిర్వహించి అనంతరం రామమందిరం వద్ద రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య అధ్యక్షుడు అమర్తలూరు చెంచయ్య, జిల్లా ఆర్యవైశ్య నాయకులు పొట్టి సుధాకర్, ధనుంజయరావు, టీడీపీ మండల అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణాధ్యక్షులు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు. అలాగే పొదలకూరు పట్టణానికి చెందిన సర్వేపల్లి నియోజకవర్గ తెలుగు వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి అనిశెట్టి వీరేంద్రబాబు కుమార్తె అనిశెట్టి శాన్విక పుట్టినరోజు వేడుకల్లో సోమిరెడ్డి శృతిరెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

• ఇన్‌చార్జి కమిషనర్ శర్మద

నెల్లూరు(సిటీ), జూన్ 19 : వర్షాకాలం సమీపిస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఇన్‌చార్జి కమిషనర్, ఏడీసీ శర్మద ఆదేశించారు. కార్పొరేషన్‌లో సచివాలయ ఉద్యోగులతో బుధవారం ఆమె సమీక్ష జరిపారు. దోమల వ్యాప్తితో సీజనల్ వ్యాధులు సంక్రమిస్తాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దీనిపై ప్రజలకూ అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీ చెన్నుడు, ఎంహెచ్‌వో వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న అధికారులు

ఏసీ నగర్ పంటకాలువలో పూడికతీయండి

ఏసీ నగర్‌లోని పంటకాలువలో పూడిక తీయాలని టీడీపీ నాయకుడు ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్ ఏడీసీ శర్మదను కోరారు. 14వ డివిజన్‌లోని ఏసీనగర్ సబ్‌డివిజనల్ మున్సిపల్ కార్యాలయం వెనక, ఎస్వీజీఎస్ కాలేజీ వరకు కాలువ పూడికతీయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మురుగు పేరుకోవడంతో కాలువ రూపురేఖలు కోల్పోయిందని, అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆంజనేయస్వామి గ్రామోత్సవం



ఆంజనేయుడి గ్రామోత్సవంలో భక్తులు

కొడవలూరు, జూన్ 19: స్థానిక శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం గ్రామ పుర వీధుల్లో స్వామి వారి ఊరేగింపు జరిగింది. రాత్రి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొవూరు వెంకీ, పంది రాధాకృష్ణ, కాకాని మూరళీ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు తావు లేకుండా విధులు నిర్వహించాలి

తోటపల్లిగూడూరు, జూన్ 19 : అక్రమాలకు తావు లేకుండా అధికారులు పనిచేయాలని టీడీపీ నేతలు కోరారు. మండలంలోని కోడూరు మేజర్ పంచాయతీలో పనిచేస్తున్న అధికారులపై ఆ గ్రామ టీడీపీ నేతలు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో చెత్త తరలించే వాహనం ఇప్పటికీ వైసీపీ నేత దగ్గరే ఉందని, 15రోజుల నుంచి అడుగుతుంటే రిపేర్‌కి ఇచ్చి వున్నామని సమాధానం చెప్పడంతో పంచాయతీ సెక్రటరీని నిలదీయడంతో పంచాయతీ ఆఫీస్ దగ్గరికి చెత్త వాహనాన్ని తీసుకొస్తామని తెలిపారు. అంతేకాక వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో రాజ్యాంగ నిర్మాత ఫోటోని తొలగించామని చెప్పడంతో సచివాలయ సిబ్బంది, పంచాయతీ సెక్రటరీపై దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపటిలోగా అంబేద్కర్, చంద్రబాబు, చంద్రమోహన్‌రెడ్డి ఫోటోలు కార్యాలయంలో ఉండాలని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరబోయిన గంగాధర్, ఊటుకూరు శ్రీనివాసులు, షేక్.అబుబకర్, కైలాసం రాజబాబు, ఊటుకూరు అవినాష్, రాగూర్, పాల్గొన్నారు.

దోమల నిర్మూలన అందరి బాధ్యత

మనుబోలు, జూన్ 19: దోమల నిర్మూలన అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మీ అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో మండలంలోని వెంకన్నపాళెం, యాచవరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో బుధవారం తల్లుల కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వారంలో ఒకరోజు డ్రైడేగా పాటించి దోమల గుడ్లను, లార్వాలను గుర్తించి ధ్వంసం చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణమ్మ, ఏఎన్ఎం సుబాషిణీ, ఉపాధ్యాయులు రామకృష్ణ, నాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్త సుజన పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

మనుబోలు, జూన్ 19: పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో బహుమతులు అందజేశారు. ఏటా జేవివి ఆధ్వర్యంలో, ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ సహకారంతో ఉత్తమ విద్యార్థులకు బహుమతులు ఇస్తున్నామని జేవివి జిల్లా సహాయ కార్యదర్శి నూనె లక్ష్మయ్య, జిల్లా కన్వీనర్ కే చైతన్యలు తెలిపారు. మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలల్లో పదిలో, జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించిన విద్యార్థులకు దాతలు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కోల్‌కతాలో కోవూరు వాసి మృతి

కోవూరు, జూన్ 19: స్థానిక మైథిలీ థియేటర్‌లో ఆపరేటర్, మేనేజరుగా పనిచేసిన పిచ్చుక శ్రీనివాసులు కోల్‌కతా నగరంలో బుధవారం మృతిచెందాడు. ఈనెల 5న ఉత్తర భారతదేశ తీర్థయాత్రలకు వెళ్లి పలు ప్రాంతాల్ని సందర్శించి కోల్‌కతాకు చేరుకున్నాడు. అక్కడి ఉష్ణోగ్రతలు తట్టుకోలేక వడ్డదెబ్బకు, గుండెపోటుకు గురై మృతిచెందినట్లుగా తెలిసింది. మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ప్రత్యేక వాహనంలో కోవూరుకు తీసుకువస్తున్నట్లు తెలిసింది.

చాముండేశ్వరిదేవికి ప్రశాంతిరెడ్డి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, జూన్ 19: మండలంలోని గంగపట్నంలో చాముండేశ్వరి దేవికి బుధవారం కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి, పుణ్యబోయిన చెంచుకిషోర్‌యాదవ్, కొండూరు సుధాకర్‌రెడ్డి, బొద్దుకూరు సుధాకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

మనుబోలు, జూన్ 19: మండలంలో గురువారం నుంచి రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి జహీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి పిల్లిపెసర 120 క్వింటాళ్లు, జనుము 17క్వింటాళ్ళు మంజూరయ్యాయి. అయితే పిల్లిపెసర మాత్రమే వచ్చాయని, త్వరలోనే జీలగులు, జనుము వస్తాయని ఏవో తెలియజేశారు. 8కేజీల పిల్లిపెసర బస్తాకు రూ. 536, పది కేజీల జనుము బస్తాకు రూ. 440 చెల్లించాలన్నారు. విత్తనాలు కావలసిన రైతులు ఆర్‌బీకేలలో ఆధార్‌కార్డు, పొలం పాసుపుస్తకాలతో వీఏఏలను సంప్రదించాలన్నారు. బయోమెట్రిక్ ద్వారానే రైతులకు విత్తనాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

కోవూరు చేరిన తిరుమల పాదయాత్ర బృందం

కోవూరు, జూన్ 19: తెలంగాణలోని నకిరేకల్‌కు చెందిన పలువురు రైతులు తిరుమలకు పాదయాత్ర చేస్తూ మంగళవారం అర్ధరాత్రి కోవూరుకు చేరుకున్నారు. వారికి సుభాష్ సేవా సమితి అధ్యక్షుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డి బస ఏర్పాట్లు చూశారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు కే శ్రీనివాసులు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆనందంగా జీవించాలని కోరుతూ వెంకటేశ్వరస్వామిని ప్రార్థించనున్నట్లు తెలిపారు.

బాధితుడికి ఆర్థిక సాయం

మనుబోలు : ఇటీవల ఇస్లాంపేట వద్ద జరిగిన బస్సు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వాసుకు వీరంపల్లి టీడీపీ నాయకులు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, రఘురామయ్య, యానాదినాయుడు, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

ఆకలితో అల్లాడిన అంగన్‌వాడీ చిన్నారులు

విడవలూరు, జూన్ 19: వరిణి గ్రామంలో బుధవారం తలపెట్టిన బడిబాట చిన్నారుల పాలిట శాపంగా మారింది. వరిణి, దండిగుంట గ్రామాల్లోని అంగన్‌వాడీ టీచర్లు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అయితే ఈ కార్యక్రమాన్ని ఆయా సెంటర్ల పరిధిలో చేయాల్సివుండగా అందరూ కలసి వరిణి గ్రామం సెంటర్‌లో నిర్వహించారు. కాగా, అంగన్‌వాడీ టీచర్, ఆయాల నిర్లక్ష్యం కారణంగా చిన్నారులకు 12గంటలకు పెట్టాల్సిన భోజనం మధ్యాహ్నం ఒంటిగంట వరకు పెట్టలేదు. దీంతో చిన్నారులు ఆకలితో అలమటించారు. దీంతో స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయటంతో అంగన్‌వాడీ ఆయా అప్పటికప్పుడు కోడిగుడ్లు వండి చిన్నారులకు పెట్టింది. కాగా, వీరారెడ్డిపాళెం గిరిజన కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో నలుగురు చిన్నారులు ఉంటే రికార్డుల్లో మాత్రం 13 మంది చిన్నారులు ఉన్నట్లు నమోదు చేశారు. ఈ విషయంపై జిల్లా అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యా వనరులను సద్వినియోగం చేసుకోండి



పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఎంఈవో

ముత్తుకూరు, జూన్ 19: ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను, విద్యా వనరులను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి మధుసూదన్ కోరారు. బుధవారం బలిజపాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులను బడిలో చేర్పించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించడంతోపాటు ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, యూనిఫారం, ఇతర వస్తువులను ఉచితంగా అందచేస్తోందన్నారు. విద్యాబోధనలోనూ ఉన్నత ప్రమాణాలను పాటిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. బలిజపాలెంకి చెందిన 13 మంది విద్యార్థులను ఒకటవ తరగతిలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

● దళిత సంఘం నేతల డిమాండ్

విడవలూరు జూన్ 19: స్థానిక తహసీల్దారు కార్యాలయానికి అనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర నాయకురాలు పల్లం శేషమ్మ డిమాండ్ చేశారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మూడురోజుల క్రితం తహసీల్దారు కార్యాలయానికి అనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసినా ఎందుకు చర్యలు తీసుకోలేదని శేషమ్మ ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోకపోతే జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళనకి దిగుతామన్నారు. ఈ సమావేశంలో దళిత సంఘం నాయకులు కవరగిరి పావని, మాణికల పావని, కమల, శ్రావణి , మరియమ్మ, సరోజ, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

బుచ్చిరెడ్డిపాళెం : పౌష్టికాహారాతోనే రక్తహీనత దూరమవుతుందని జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి అహ్మద్‌బాబు తెలిపారు. బుధవారం ప్రపంచ సికిల్ సెల్ ఎనామియా దినోత్సవం సందర్భంగా గిరిజనకాలనీలో ఎస్టీ మహిళలు, గర్భిణులు, బాలింతలు, యువతులకు రక్తపరీక్షలు చేసి రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెంచలయ్య, మనోహర్, వైద్యులు, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతో ఉజ్వల భవిష్యత్

బుచ్చిరెడ్డిపాళెం : విద్యతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మండల విద్యాశాఖ అధికారులు ఎం దిలీప్‌కుమార్, పీవీ రత్నం అన్నారు. బుధవారం బుచ్చి నగర పంచాయతీలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు తిరుపతికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ దాత సి అయ్యప్ప చరణ్‌రెడ్డి సహకారంతో బుచ్చిలోని దొడ్ల కోదండరామిరెడ్డి విద్యాసామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులురెడ్డి, రిసోర్సు సభ్యులు గండికోట సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం ఆర్‌వో ప్లాంట్ ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులోని గోపాలకృష్ణయ్య స్కూల్లో విద్యార్థుల కోసం దాతల సహకారంతో ఏర్పాటుచేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను బుధవారం తన్నీరు సుధాకర్, పైడా రవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థిని ముల్లంగి సుభాషిణి పేద విద్యార్థులకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్, ప్రిన్సిపాల్ సురేఖ, గిరిజ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు టీఎన్ఎస్ఎఫ్ అండ

మనుబోలు, జూన్ 19: పాఠశాలల్లో ఎటువంటి సమస్యలున్నా టిఎన్ఎస్ఎఫ్‌కు తెలియజేయాలని సర్వేపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి రేవూరి సుమంత్ అన్నారు. బుధవారం స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులతో సుమంత్ మాట్లాడుతూ టిఎన్ఎస్ఎఫ్ విద్యార్థులకు అండగా నిలుస్తుందని, ప్రతి సమస్యను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు అవినాష్, నంద, ప్రవీణ్, వెంకటేష్, బెనర్జీ పాల్గొన్నారు.

మంత్రి ఆనంకు మెడికవర్ ప్రతినిధుల శుభాకాంక్షలు



మంత్రి ఆనంను సత్కరిస్తున్న మెడికవర్ ప్రతినిధులు

నెల్లూరు (వైద్యం), జూన్ 19 : దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి మెడికవర్ ఆసుపత్రి ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని నగరంలోని ఆయన నివాసంలో బుధవారం కలిసి సత్కరించారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ డాక్టర్ ధీరజ్ రెడ్డి, కేన్సర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ డాక్టర్ బిందురెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సతీష్‌బాబు, పీఆర్వో చందువర్మ, ఆత్మకూరు మున్సిపాలిటీ కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టినరోజు



వెంకటేశ్వరపురంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న దేవకుమార్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు

నెల్లూరు (వైద్యం/ వెంకటేశ్వరపురం), జూన్ 19 : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం నగరంలో ఘనంగా జరిగాయి. ఇందిరాభవన్‌లో పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమర్‌రెడ్డి కేక్‌కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం రాహుల్ గాంధీకే సాధ్యమన్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారత్ జూడో పాద యాత్ర ద్వారా ప్రజల కష్టాలు స్వయంగా తెలుసుకున్న గొప్ప వ్యక్తి ఆయన అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు తలారి బాలసుధాకర్, శీలం తిరుపతయ్య, సిటీ అధ్యక్షుడు ఫయాజ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మోహన్, మీడియా ఇన్‌చార్జి సంజయ్‌కుమార్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. ఇదేవిధంగా వెంకటేశ్వరపురంలోనూ పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. స్థానిక 54వ డివిజన్ ఇన్‌చార్జి నరసాపురం ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షుడు చేవూరు వేవకుమార్‌రెడ్డి హాజరయ్యారు. నాయకులు ఫయాజ్, సుధీర్, మోహన్, నరేష్, మీరా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయండి

● మీరు మారకుంటే మేం మార్చాల్సి వస్తుంది

● అధికారులకు రూరల్ ఎమ్మెల్యే హెచ్చరిక



సమీక్షలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, జూన్ 19 : నెల్లూరు రూరల్ మండలంలోని గ్రామాల్లో ప్రజలకు మంచి పాలన అందించేందుకు, పల్లెల అభివృద్ధికి చక్కటి ప్రణాళికలు తయారు చేసి ఇవ్వాలని అధికారులను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కోరారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో 18 గ్రామాలకు సంబంధించి అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోనే తన నియోజకవర్గం మొదటి స్థానంలో ఉండే విధంగా చూసుకునే బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే చెప్పారు. ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన అధికారులు తీరు మార్చుకోకపోతే తామే మార్చాల్సి వస్తుందని పరోక్షంగా హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సుపరిపాలన అందాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు

నెల్లూరు(క్రైం), జూన్ 19: నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలా పాలను అరిక ట్టడంలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి జిల్లా వ్యాప్తంగా పోలీసులు లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు జరిపారు. లాడ్జీల్లోని ప్రతి గదిని క్షుణ్ణంగా పరిశీలించారు. వాటిలో బస చేసిన వారి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మాట్లాడుతూ లాడ్జీల యాజ మాన్యం ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని, అనుమానితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు తావిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లాడ్జీల పరిసరాలు స్పష్టంగా కనిపించేలా తప్పని సరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి: రూరల్ సీఐ

నెల్లూరు రూరల్, జూన్ 19 : కొత్తవ్యక్తులు, అనుమానితులపై తమకు సమాచారం అందచేయాలని నెల్లూరు రూరల్ సీఐ మారుతీకృష్ణ ప్రజలకు సూచించారు. బుధవారం రూరల్‌లోని అల్లీపురం వద్దనున్న టిడ్కో గృహ సముదాయం వద్ద కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఆకస్మిక తనిఖీలు తరుచూ జరుగుతుంటాయని, ఇళ్ల వద్దకు కొత్త వ్యక్తులు, అనుమానితులు ఎవరైనా వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందచేయాలన్నారు. ప్రజల రక్షణ నేపథ్యంలో పోలీసులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సెబ్ పోలీసులు కూడా పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 19 : నగరంలోని మాగుంట లే అవుట్‌లో గల ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు బుధవారం రాత్రి అంకురార్పణ వైభవంగా జరిగింది. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, విశేష పూజలు, యాగశాల ప్రవేశం, అంకురార్పణ హోమం జరిగాయి. భక్తులతో ఆలయం కళకళలాడింది. గోవింద నామస్మరణ మారుమోగింది.

● నగరంలోని మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 22తేదీ ఉదయం 9గంటలకు సామూహిక సత్యనారాయణ వ్రతం జరుగుతుందని ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. భక్తులందరూ తరలిరావాలని కోరింది.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 19: పౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ప్రముఖ పుణ్యక్షేత్రం అరుణాచలానికి ఆర్టీసీ అధికారులు రెండు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఈ నెల 21వ తేదీ ఉదయం 10 నుంచి 10.30 గంటల మధ్య నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు నుంచి ఈ బస్సులు బయలుదేరనున్నాయి. టికెట్ బుకింగ్ కేంద్రాల్లో, ఆన్‌లైన్ ద్వారా ప్రయాణికులు ప్రత్యేక బస్సులకు టికెట్లు రిజర్వేషన్ చేసుకోవచ్చు. టికెట్టు ధర రూ.1200గా నిర్ణయించారు. భక్తుల సంఖ్య పెరిగితే బస్సుల సంఖ్య పెంచుతామని అధికారులు పేర్కొన్నారు.



ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని ట్రంకురోడ్డు (శివాజీ సెంటర్)లో బుధవారం హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఆవిష్కరణ జరిగింది. బీజేపీ రాష్ట్ర మోర్చాల సమన్వయకర్త పీ సురేంద్రరెడ్డి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రాంత కుటుంబ సంయోజక్ పుట్టా శేషరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, పార్టీ ప్రముఖులు విగ్రహాన్ని ఆవిష్కరించారు. మరాఠా సంఘం ప్రతినిధులు ఆర్ఎస్ఎస్ నగర్ సంచాలక్ బయ్యా రవి, ఏవీఆర్ మోహన్‌రావు, గంగాధర్, సాయికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి శుభాకాంక్షలు

నెల్లూరు(హరనాథపురం), జూన్ 19 : కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి శుభాకాంక్షలు, అభినందనల పరంపర కొనసాగుతోంది. బుధవారం కోవూరు నియోజకవర్గ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీ వెంకయ్య ఆధ్వర్యంలో సాంఘిక సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు ఎమ్మెల్యేను కలిశారు. సర్వేయర్లు ఎమ్మెల్యేను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కోవూరు ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. విడవలూరు మండల వావిళ్ల ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకర్ ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందుకూ రుపేట కొత్తూరు సాయిబాబా మందిరం చైర్మన్ కోదండరామిరెడ్డి, రావూరు మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, టీడీపీ నాయకుడు గోపాల్ యాదవ్, కొండాపురం టీడీపీ మహిళా అధ్యక్షురాలు జయలక్ష్మి తదితరులు ప్రశాంతిరెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ

నెల్లూరు రూరల్, జూన్ 19 : మండలంలోని సౌత్‌మోపూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం పెళ్లకూరు రవీంద్రారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో విద్యా ఉపకరణాలు అందచేశారు. దాతలకు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

కాలం చెల్లిన పాఠశాలల బస్సులు సీజ్ చేయాలి: బీజేవైఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 19: జిల్లాలోని పాఠశాలల బస్సుల్లో కాలం చెల్లిన వాటిని సీజ్ చేయాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి డీటీసీ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా ఇన్‌చార్జి లెక్కల రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యం విద్యార్థులను తరలించే బస్సుల ఫిట్‌నెస్‌పై నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. ఇటీవల తరచూ జరుగుతున్న ప్రమాదాలే ఇందుకు నిదర్శనమన్నారు. విద్యార్థుల జీవితాలను దృష్టిలో ఉంచుకొని తరచుగా పాఠశాలల బస్సులను తనిఖీ చేయాలని రవాణాశాఖ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మదన్‌సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుజ్జిరెడ్డికి ఘన నివాళి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 19: అకాల మరణం చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం బుజ్జిరెడ్డికి ఆ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. సంగంలోని ఆయన స్వగృహంలో బుధవారం జరిగిన ఉత్తరక్రియల కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు పాల్గొన్నారు. కర్నాటి ఆంజనేయరెడ్డి, పీ సురేంద్రరెడ్డి, వంశీధర్‌రెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.

గర్భిణులకు డ్రైఫ్రూట్స్ పంపిణీ

నెల్లూరు (వైద్యం): నారాయణ ఆసుపత్రిలో యాజమాన్యం వినూత్న కార్యక్రమం చేపట్టింది. గర్భిణులకు ఉచితంగా డ్రైఫ్రూట్స్ పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించింది. గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రసన్న గర్భవతులకు డ్రైఫ్రూట్స్ పంపిణీ చేపట్టారు. నారాయణ మాతృసేవా పథకంలో భాగంగా గర్భిణులకు ఉచిత పరీక్షలు, మందులు, పౌష్టికాహారం, కాన్పు కోసం ఉచిత అంబులెన్స్, ఉచిత కాన్పులు, బేబీ హెల్త్‌కిట్ అలాగే బిడ్డ పోషణ నిమిత్తం నగదు ప్రోత్సాహం ఇస్తున్నట్లు తెలిపారు. గర్భిణులకు 5వ నెల నుంచి 9వ నెల వరకు నెలవారి చెకప్‌లకు వచ్చిన వారికి ఇకనుంచి డ్రైఫ్రూట్స్ అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సతీష్, వైద్యులు, ఏజీఎం శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీ వేయాలి

నెల్లూరు (సాంస్కృతికం) జూన్ 19 : రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం తక్షణం 12వ పీఆర్సీ వేయాలని, కమ్యుటేషన్ రికవరీ పీరియడ్‌ను 12 సంవత్సరాలకు తగ్గించాలని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎం గౌస్, ప్రధాన కార్యదర్శి ఎస్‌పీవీఎస్ మూర్తి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని భక్తవత్సలనగర్‌లో గల పెన్షన్ భవన్‌లో జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. గౌస్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వానికి తమ డిమాండ్లు పంపామని, వాటిని పరిష్కరించకుంటే మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి పోరాటం చేసేందుకు ప్రతి పెన్షన్‌దారుడు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ రమణయ్య మాట్లాడుతూ లైఫ్ సర్టిఫికెట్లు ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మస్తానయ్య, వీ వీరేంద్ర, షేక్ ఖాసిం, కోటీ శ్వరరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ బృందం కంటి వైద్య శిబిరం నిర్వహించింది.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 20 జూన్ 2024



తిరుపతిలో ఎంతో నేర్చుకున్నా


- బదిలీపై వెళుతున్న కలెక్టర్ ప్రవీణ్ కుమార్
- గనుల శాఖ కమిషనర్‌గా ప్రమోషన్
- ఇంఛార్జి కలెక్టర్‌గా జేసీ ధ్యానచంద్ర


తిరుపతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ బదిలీ అయ్యారు. తదుపరి కలెక్టర్ నియమితులయ్యే వరకూ జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర ఇంచార్జి కలెక్టర్‌గా విధులు నిర్వర్తించనున్నారు.బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా ప్రవీణ్ కుమార్ ప్రాధాన్యత కలిగిన మైన్స్ అండ్ జియాలజీ శాఖకు కమిషనర్ మరియు డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. అలాగే మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పోస్టులోనూ పూర్తి అదనపు బాధ్యతలతో నియమితులయ్యారు.గత ఏప్రిల్‌లో ఎన్నికల షెడ్యూలు కూడా విడుదలయ్యాక అప్పటి కలెక్టర్ లక్ష్మీశ పనితీరు పట్ల అసంతృప్తితో ఎన్నికల కమిషన్ ఆయనపై బదిలీ వేటు వేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో జిల్లా కలెక్టర్ పోస్టు కోసం సీఎస్ ప్రతిపాదించిన ముగ్గురు అధికారుల్లో ఈసీ ప్రవీణ్ కుమార్ నియామకాన్ని ఆమోదించింది. దీంతో గత ఏప్రిల్ 4న కలెక్టర్‌గా, జిల్లా ఎన్నికల అధికారిగా బాధ్యతలు తీసుకున్న ప్రవీణ్ కుమార్ ఎన్నికల నిర్వహణలో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నారు. పోలింగ్ రోజు చంద్రగిరి నియోజకవర్గంలో పలు చోట్ల హింసాత్మక ఘటనలు జరిగినా, మరుసటి రోజు స్ట్రాంగ్ రూములున్న పద్మావతీ వర్సిటీ ఆవరణలో చంద్రగిరి టీడీపీ అభ్యర్థిపై భయానక దాడి జరిగినా...కలెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్ పనితీరు పట్ల ప్రతిపక్షాల నుంచీ ఎలాంటి ఫిర్యాదులూ, ఆరోపణలు, విమర్శలు రాలేదు. నిష్పాక్షికంగా పనిచేశారన్న అభిప్రాయం ప్రభుత్వ పెద్దల్లో వుండడంతోనే తాజా బదిలీల్లో ఆయనకు కీలకమైన మైన్స్ అండ్ జియాలజీ శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ పోస్టు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలకరించగా శ్రీవారు కొలువైన తిరుపతి జిల్లాలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా అన్నారు.అత్యంత క్లిష్టమైన ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చానని, అయితే ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, మీడియా సహకారంతో సమర్థవంతంగా ఎన్నికలను నిర్వహించగలిగానన్నారు. గతంలో కీలకమైన వైజాగ్ సహా మూడు జిల్లాల్లో కలెక్టర్‌గా పనిచేసినా తిరుపతిలో ప్రోటోకాల్ విధులు సహా ఎంతో నేర్చుకున్నా అన్నారు. ఈ జిల్లాలో ప్రతి ఐఏఎస్ అధికారీ నేర్చుకోవాల్సింది ఎంతో వుందని భావిస్తున్నానన్నారు. పనిచేసింది రెండున్నర నెలల స్వల్ప సమయమే అయినా కల్మషం లేకుండా ప్రశాంతంగా వుండే ఇక్కడి ప్రజలు అందించిన సహకారం మరవలేనంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.


ప్రవీణ్ కుమార్


ధ్యానచంద్ర









వెంగమాంబ పేరంటాల ఆలయం

23 నుంచి వెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు సిద్ధమవుతున్న వడ్డిపాలెంలోని వెంగమాంబ పుట్టినిల్లు

- 27 వరకు నిర్వహణ
- నర్రవాడలో విస్తృత ఏర్పాట్లు
- ప్రత్యేక బస్సులు నడపనున్న ఆర్టీసీ
- ఇతర రాష్ట్రాలు, దేశాల నుంచి తరలిరానున్న భక్తులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జూన్ 19: భక్తుల కొంగుబంగారమై వెలుగొందుతున్న వెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నర్రవాడలో ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వారేకాక, తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటకలతోపాటు ఇతర దేశాల్లో ఉన్న వారు సైతం ఏడాదికి ఓసారి జరిగే ఈ ఉత్సవాల్లో పాల్గొనడం ఆనవాయితీ. వెంగమాంబ ఉత్సవాల సీజన్ మొదలైదంటేచాలు ఉదయగిరి నియోజకవర్గంతోపాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉన్న ఉదయగిరివాసులు వారి స్వగ్రామాలకు చేరుకుంటారు. ఈ ఉత్సవాలకు సుమారు 7లక్షల మందికిపైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు.

● అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే... !

వెంగమాంబ దయ ఉంటే అన్నీ ఉన్నట్టేనని భక్తుల విశ్వాసం. ఈ ఉత్సవాల్లో సంతానంలేని దంపతులెందరో వరపడడం పరిపాటి. అమ్మవారి సన్నిధిలో నిద్రిస్తే సంతానం భాగ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. అమ్మవారి సొమ్మును పెట్టుబడిగా వినియోగించడం ఈ ప్రాంతీయులకు ఆది నుంచి వస్తున్న ఆచారం. ఆలయ కమిటీ నుంచి కొంత సొమ్మును రుణంగా పొంది ఆ నగదును లావాదేవీల్లో వినియోగిస్తే వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా వృద్ధి చెందుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. వెంగమాంబకు నిత్యపూజలు జరుగుతాయి. ఉత్సవాలతో నిమిత్తం లేకుండా భక్తులు ప్రతి ఆది, గురువారాల్లో అధికసంఖ్యలోనే అమ్మవారిని దర్శిస్తారు.



ప్రత్యేక అలంకరణలో వెంగమాంబ దంపతులు

● నిలుపుతో ఉత్సవాల ప్రారంభం

ఈనెల 23న నిలుపు, సంతానం లేని వారు వరపడుట, పసుపు దంచే కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 24న గ్రామోత్సవం, సంతానం లేనివారు వరపడుట, 25న గ్రామోత్సవం, 26న కల్యాణోత్సవం, పసుపు కుంకుమ ఉత్సవం, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న బండ్లు తిరుగుట, పొంగళ్లు, రాష్ట్రస్థాయిలో ఎడ్ల బండలాగుడు పందేలతో ఉత్సవాలు ముగుస్తాయి.

నర్రవాడకు ప్రత్యేక సర్వీసులు

ఉదయగిరి, జూన్ 19: దుత్తలూరు మండలం నర్రవాడ వెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాలకు 25 ప్రత్యేక బస్సు లు నడపనున్నట్లు ఉదయగిరి డిపో మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి, సీతారామపురం, పోరుమామిళ్ల నుంచి ఐదు చొప్పున, బద్వేల్ నుంచి 10 సర్వీసులు నడపనున్నట్లు ఆయన తెలిపారు. సాధారణ చార్జీలతోనే ప్రత్యేక సర్వీసులు నడుపుతామన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు



వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాల్లో తాగునీరు, వైద్య సదుపాయం, పారిశుధ్యం లాంటి కార్యక్రమాలతోపాటు 395 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. భక్తుల రాక కోసం వివిధ మార్గాల్లో 70 ప్రత్యేక బస్సులు నడపనున్నాం. అమ్మవారి దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశాం. భక్తులంతా అమ్మవారిని దర్శించుకుని ఆమె కృపకు పాత్రులు కావాలి.

- వెట్టిగుంట ఉషశ్రీ, ఆలయ ఈవో

వెంగమాంబ హుండీల రాబడి రూ.12,05,440



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూన్ 19: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైననర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ హుండీలను బుధవారం లెక్కించారు. ఆలయ ఈవో వెట్టి గుంట ఉషశ్రీ ఆధ్వర్యంలో దేవదాయ ధర్మదాయ శాఖ కోవూరు డివిజన్ పరిశీలకుడు ఎం.సుధీర్ పర్యవేక్షణలో 2024 మార్చి 20 నుంచి 2024 జూన్ 19 వరకు హుండీలను లెక్కించగా రూ.12,05,440ల లక్షల రాబడి వచ్చింది. ఈ కార్యక్ర మంలో ఉప ప్రధాన అర్చకులు బీ పెద్దభద్రయ్య, సీనియర్ అసిస్టెంట్ మహేష్ పాల్గొన్నారు.

అదుపు తప్పిన కారు : ఇద్దరికి స్వల్పగాయాలు



రాళ్ల గుట్టల్లోకి దూసుకెళ్లిన కారు

ఉదయగిరి రూరల్, జూన్ 19: మండలంలోని సర్వరాబాదు గ్రామ సమీపంలో 167బీజీ జాతీయ రహదారిపై బుధవారం కారు అదుపుతప్పి చెట్లలోకి దూసుకెళ్లిం ది. ప్రకాశం జిల్లా సింగరాయకొం డకు చెందిన కొంతమంది కావలి లో బీటెక్ చదువుతున్న విద్యార్థితో కలిసి కారులో భైరవ కోనకు బయలుదేరారు. సర్వరాబాదు గ్రామ సమీపానికి రాగానే కారు అదుపు తప్పి మార్జిన్ దాటి రాళ్ల గుట్టల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, కారు ముందుభాగం దెబ్బతింది. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

బస్సు ఢీకొని వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైం), జూన్ 19: వేగంగా వస్తున్న బస్సు ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు... ఉదయగిరి నుంచి నెల్లూరు వస్తున్న ఆర్టీసీ బస్సు మంగళవారం సాయంత్రం సాలుచింతల జంక్షన్ వద్ద వస్తుండగా గుర్తుతెలియని వృద్ధురాలిని ఢీకొంది. దీంతో ఆమె అక్క డికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్ఐ గీతారమ్య ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. చుట్టుపక్కల ఆరా తీయ గా వెంకటేశ్వరపురం పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో వృద్ధురాలు భిక్షాటన చేసుకుంటూ ఉంటుందని, ఆమెకు కుమారుడు ఉన్నాడని తెలిసింది. మృతదేహంపై పింక్ కలర్ నైటీ ఉందని, ఆమె వివరాలు తెలిసిన వారు నార్త్ ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు. వృద్ధురాలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	150
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	294
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6826
వెండి కిలో ధర	రూ. 90,700
వెండి ఒక గ్రాము	రూ. 92.70

22న చెట్ల వేలం

కోట, జూన్ 19 : పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ఈ నెల 22న కూలిన టేకు, ఇతర రకాల చెట్లకు సంబంధించి వేలం నిర్వహిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ తెలిపారు. మిచౌంగ్ తుఫాన్ కారణంగా కోర్టు ప్రాంగణంలో నేలకొరిగిన, పడిపోయిన చెట్లకు సంబంధించి ఈ వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 22వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జరిగే వేలంలో నేరుగా పాల్గొన వచ్చన్నారు. హాజరుకావాలన్నారు.

బంగారుపేటలో పోలేరమ్మ జాతర

వెంకటగిరి టౌన్, జూన్ 19: పట్టణంలోని బంగారుపేట పోలేరమ్మ జాతర బుధవారం ప్రారంభమైంది. వాస్తవానికి పోలేరమ్మ జాతరను ఐదేళ్లకోసారి నిర్వహిస్తారు. అనివార్య కారణాలతో నిర్వహించలేదు. దీంతో కమిటీ నిర్ణయం మేరకు తొమ్మిదేళ్ల తరువాత పోలేరమ్మ జాతరను ఘనంగా జరుపుకుంటున్నారు. బుధవారం సాయంత్రం కుమ్మరి ఇంటి వద్ద అమ్మవారి ప్రతిమను తయారు చేసి సాకలి వీధికి తీసుకువస్తారు. అక్కడినుంచి అర్ధరాత్రి 2గంటలకు అమ్మవారికి కళ్లు, దిష్టి చుక్క పెట్టి సప్పరంపై అధిష్టింపజేసి ఊరేగిస్తూ మండపానికి తీసుకుని వస్తారు. భక్తులు తమ మొక్కులు తీర్చుకుంటారు. గురువారం మధ్యాహ్నం 3గంటలకు అమ్మవారిని సప్పరంపై ఊరేగించడంతో జాతర ముగుస్తుంది.





పుష్పాలంకరణలో పోలేరమ్మ అమ్మవారి మండపం

కుమ్మరింటి వద్ద అమ్మవారు

వరవ కాలువను పునరుద్ధరించాల్సిందే



సర్వే చేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

చిల్లకూరు, జూన్ 19: మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు సమీపంలోని లేఅవుట్‌లో పూడ్చి వేసిన వరవ కాలువను యాజమాన్యం పునరుద్ధరించాల్సిందేనని తహసీల్దారు శ్రీనివాసులు, ఇరిగేషన్ డీఈ చంద్రశేఖర్ చెప్పారు. బుధవారం పూడ్చే టసిన కాలువను పరిశీలించి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలువకు సంబంధించి హద్దులు ఏర్పాటు చేశామన్నారు. ఇరిగేషన్ ఏఈ సురేష్‌బాబు, ఆర్ఐ రమ్య, సర్వేయర్ మల్లికార్జున్, వీఆర్వో రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



గూడూరు, జూన్ 19: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు చేపడుతామని రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం స్థానిక పంబలేరు సమీపంలోని మద్యం దుకాణం వద్ద పరిసరాలను పరిశుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో తాగి గొడవలకు దిగినా, ప్రజలకు ఇబ్బందులు కలిగించినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్త హీనతపై అవగాహన

బాలాయపల్లి/ వెంకటగిరి, జూన్ 19: మన ఇళ్లలో ఉండే చిరు ధాన్యాలతో పిండి వంటలు చేసుకుని తినడంతో పౌష్టికాహారం లోపం నివారించడంతో పాటు రక్తహీనత నుంచి బయట పడవచ్చని ఏపీఎం శ్రీను అన్నారు. బుధవారం బాలాయపల్లి ఎస్టీ కాలనీలో రక్తహీనతపై అవగాహన కల్పించారు. హెచ్‌డీసీసీ మమత, సిబ్బంది పాల్గొన్నారు. వెంకటగిరి పట్టణంలోని శివాలయం సచివాలయంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి రాజేష్ రక్తహీనతపై అవగాహన కల్పించారు.కండరాల నొప్పి, కళ్లు పసుపురంగులోకి మారిపోతే వెంటనే రక్త పరీక్షలు నిర్వహించుకోవాలని చెప్పారు. నలభై ఎళ్ళు లోపు గిరిజనులందరూ పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. సచివాలయ హెల్త్ సెక్రటరీ సత్యవేణి, అడ్మిన్ సుబ్బరాయులు, మహిళా పోలీసు సుజాత తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు



సూళ్లూరుపేట, జూన్ 19: ఈ ఏడాది టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆచార్య భరద్వాజా సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నగదు ప్రోత్సాహక బహుమతులు అందించారు. మూడు సంవత్సరాల నుంచి టెన్త్‌లో 500 పైగా మార్కుల సాధించిన వారికి బహుమతులు అందిస్తున్నారు. ఈ ఏడాది మండలంలో 500 మార్కులు పైబడి సాధించిన 21 మంది విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను ఎంఈవో శ్రీనివాసుల రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 శీనయ్య, సంస్థ నిర్వాహకుడు ఎంఎం చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఎంపీడీవోకు సన్మానం



ఆమోస్‌బాబుకు గజమాలతో సత్కారం

తడ, జూన్ 19: ఎంపీడీవోగా పదవీ విరమణ చేసిన ఆమోస్‌బాబును ఉద్యోగులు సత్కరించారు. బుధవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీడీవో మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. సమయపాలన పాటించి ప్రజలకు ప్రభుత్వ సేవలు అందజేసిన ఆమోస్‌బాబు సేవలను పలువురు కొనియాడారు. అనంతరం ఆయనను గజమాల, శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె.రఘురెడ్డి, సర్పంచులు అర్మగం, సుందరరెడ్డి, రమణయ్య, పరమశివంరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్, డిప్యూటీ తహసీల్దారు శరత్‌బాబు, ఎంఈవో మల్లికార్జున్‌రావు, పలువురు పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జనసేన నాయకుల సంబరాలు

వెంకటగిరిటౌన్, జూన్ 19: ఏపీ ఉప ముఖ్యమంత్రిగా పవన్‌కల్యాణ్ పదవి చేపట్టడంతో జనసేన ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా పోటీ చేసిన 21స్థానాల్లో గెలుపొందడం ఆనందంగా ఉందన్నారు. పదవి అలంకారం కాదని ప్రజా శ్రేయ స్సే ధ్యేయంగా తమ పార్టీ అధినేత పవన్ పని చేస్తారని అన్నారు. అనంతరం టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

మహిళ మెడ నుంచి సరుడు చోరీ

నాయుడుపేట టౌన్, జూన్ 19: పట్టణంలోని రాజగోపాలపురం 5వ వీధిలో మహిళ మెడ నుంచి 4 సవర్ల సరుడు అపహరణకు గురైన సంఘటన చోటుచేసుకుంది. డి.శకుంతలమ్మ అనే వృద్ధురాలు బుధవారం ఉదయం ఇంటి ముందర ముగ్గు వేస్తుండగా గుర్తుతెలియని యువకుడు అకస్మాత్తుగా ఆ మహిళ మెడలో ఉన్న సరుడును లాక్కుని పరారయ్యాడు. ఈ మేరకు శకుంతలమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

పాత రైతుబజారు అభివృద్ధికి చర్యలు

గూడూరు, జూన్ 19: స్థానిక ధర్మరాజులస్వామి గుడి ఎదురుగా ఉన్న పాత రైతుబజారు అభివృద్ధి చేసి ఆ ఆలయానికే అప్పటించనున్నట్టు టీడీపీ మాజీ కౌన్సిలర్ వి.శివకుమార్ తెలిపారు. బుధవారం పాత రైతుబజారు ప్రాంతాన్ని దేవదాయశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదాయశాఖకు చెందిన ఈ స్థలంలో గతంలో రైతుబజారు నిర్వహించేవారన్నారు. ప్రస్తుతం రైతు బజారును కొత్తగా నిర్మించిన ప్రాంతంలోకి మార్చారన్నారు. దీంతో పాత రైతుబజారులో చెత్తాచెదారాలు పేరుకుపోయి డంపింగ్‌యార్డులా మారిందన్నారు. చెత్తాచెదారాలను తొలగించి అభివృద్ధి పరిచేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో రత్నం, ధర్మరాజులస్వామి గుడి ఈవో నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ధరలకు పుస్తకాల విక్రయాలు

● ఎంఈవోకు ఏబీవీపీ నాయకుల వినతి

నాయుడుపేట, జూన్ 19: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో పాఠ్యాంశ పుస్తకాలను అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తడుకు చెందు చెప్పారు. నాయుడుపేట ఎంఈవో కార్యాలయంలో బుధవారం ఎంఈవో మునిరత్నంకు దీనిపై వినతిపత్రం అందజేశారు. అలాగే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాకుండా ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నారని, విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, క్రీడాప్రాంగణం, లేబరేటరీలు సక్రమంగా లేవన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రైవేట్ విద్యాసంస్థల్లో తనిఖీలు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వినయ్, వెంకట్, బాబు తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి సహకరించండి



గూడూరు అర్బన్, జూన్ 19: తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఐదు మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులకు సహకరించాలని పురపాలకశాఖ మంత్రి నారాయణకు మాజీ ఎమ్మెల్యే వరప్రసాద రావు విన్నవించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అదేవిధంగా విజయవాడలో మత్స్యశాఖ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ అధికారి అంజలిని, ఇతర అధికారులను కలిసి తిరుపతి పార్లమెంటు పరిధిలో మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

లోకేశ్‌కు గణపర్తి సత్కారం



చిట్టమూరు, జూన్ 19 : అమరావతిలోని సచివాలయంలో వద్ద ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌కు చిట్టమూరు టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని లోకేశ్ తనకు సూచించినట్లు కిషోర్‌నాయుడు తెలిపారు. యువగళం విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ పార్టీలో సముచిత స్థాని కల్పించనున్నట్టు భరోసా ఇచ్చారు. అనంతరం హోం మంత్రి అనితను ఆమె చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. గణపర్తితో పాటు మారంరెడ్డి జనార్దన్‌రెడ్డి, నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, కస్తూరయ్యలు ఉన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో వార్షిక ట్రైనింగ్ క్యాంప్

కోట, జూన్ 19: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 10(ఎ) నావెల్ యూనిట్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో వార్షిక ట్రైనింగ్ క్యాంప్‌ను నిర్వహించనున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఈ క్యాంప్‌కు రాష్ట్రంలోని ఐదు జిల్లాల నుంచి 600 మంది ఎన్‌సీసీ కేడెట్లు హాజరవుతారన్నారు. ఈ క్యాంప్‌ను ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో కేడెట్లకు నావిగేషన్, నావెల్ ఓరెంటేషన్, బిట్‌వర్క్, డ్రిల్ తదితరాలపై శిక్షణ ఇస్తారన్నారు. నావెల్ ఎన్‌సీసీ అధికారి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

విజయశ్రీకి ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్ల సత్కారం



నాయుడుపేట టౌన్, జూన్ 19 : సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని సత్కరించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే విజయశ్రీతోపాటు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ సీనియర్ నేత శిరసనంబేటి విజయభాస్కర్ రెడ్డిని ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్‌లు శాలువాలు కప్పి సన్మానించారు. సన్మానించిన వారిలో ఇసనాక పద్మనాభరెడ్డి, తంబిరెడ్డి మనోహర్‌రెడ్డి, ఆర్. గోపాల్‌నాయుడు, శివయ్య, షాలినీ, రాజశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, దినేష్ తదితరులు ఉన్నారు.

ఉపసర్పంచ్ రాజీనామా

కోట, జూన్ 19: మండలంలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీ ఉపసర్పంచ్ రాయపు కోటేశ్వరరావు తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని ఎంపీడీవో శంకరయ్యకు అందజేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చలేని కారణంగా నైతిక బాధ్యత వహిస్తూ తన ఉపసర్పంచ్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. ఈ రాజీనామాపత్రాన్ని ఉన్నతాధికారులకు పంపుతామని ఎంపీడీవో తెలిపారు.

శ్మశాన స్థల ఆక్రమణపై ఫిర్యాదు

కోట, జూన్ 19: మండలంలోని కేశవరంలో తమ శ్మశానస్థలాన్ని ఆక్రమిస్తున్నారంటూ బుధవారం ముస్లింలు తహసీల్దారు నాగరాజరావుకు ఫిర్యాదు చేశారు. కేశవరంలోని సర్వేనెం.287లో ఉన్న 5.30 ఎకరాలను స్థానిక ముస్లింలు శ్మశానంగా వాడుకుంటున్నారన్నారు. అయితే కొంతమంది భూస్వాములు ఆ భూములపై కన్నేసి కబ్జాచేసే ప్రయత్నం చేస్తున్నారని తక్షణం చర్యలు తీసుకోవాలని ముస్లింలు కోరారు.

ప్రభుత్వ వైద్య కళాశాల హాస్టల్‌లో భారీ చోరీ

- మెడికోల ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, ట్యాబ్‌ల గల్లంతు
- సుమారు రూ.7లక్షల సొత్తు అపహరణ
- తెలిసిన వారి పనే అని అనుమానం
- పోలీసులకు ఫిర్యాదు



చోరీ జరిగిన బాయిస్ హాస్టల్

నెల్లూరు (వైద్యం), జూన్ 19 : నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాల బాయిస్ హాస్టల్‌లో బుధవారం భారీ చోరీ జరిగింది. మెడికోలకు చెందిన 8 ఫోన్లు, రెండు ల్యాప్‌టాప్‌లు, 3 ట్యాబ్‌లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. ఉదయం 6.30-7 గంటల మధ్య ఈ చోరీ జరిగినట్లు వైద్య విద్యార్థులు తెలిపారు. చోరీ జరిగినట్లు వెంటనే గుర్తించిన మెడికోలు ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా బుజబుజ నెల్లూరు వరకు వెళ్లారు. ఆ తర్వాత అపహరించిన ఫోన్లను నిందితులు ఆపేసినట్లు గ్రహించి దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ జరిగిన సొత్తు విలువ సుమారు రూ.7లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. చోరీ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ వసుంధరాదేవి దృష్టికి తీసుకెళ్లారు.

పని చేయని సీసీ కెమెరాలు

ప్రభుత్వ వైద్య కళాశాల హాస్టల్‌లో 400 మంది దాకా మెడికోలు ఉన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎలాంటి రాగింగ్ జరగకూడదన్న ఉద్దేశంతో గదికి ముగ్గురు వంతున కేటాయించారు. ఫస్ట్‌ఫ్లోర్‌లో గదికి ఇద్దరు వంతున మూడో సంవత్సరం, ఫైనలియర్ మెడికోలకు కేటాయించారు. ఈ భవనంలో 4 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కారిడార్‌లో గదుల బయట మెడికోలు ఏమి చేస్తున్నారన్న నిఘా ఉంటుంది. అయితే ఎనిమిదేళ్లుగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో దొంగలు చేతివాటం చూపుతున్నారు. 2022లో ఇదే హాస్టల్‌లో రెండు ఫోన్ల చోరీ జరగ్గా పోయిన సొత్తును వెంటనే రికవరీ చేసి మెడికోలకు అప్పగించారు. కానీ, తాజాగా జరిగిన చోరీలో పెద్ద ఎత్తున వస్తువులు ఎత్తుకెళ్లారు. దీంతో అధికారులు వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఇదేనా!?

నెల్లూరు (క్రైం) : 'సార్.. మా హాస్టల్లోకి దొంగలు చొరబడి మొబైళ్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు దోచుకెళ్లారు' అంటూ పోలీసు స్టేషన్‌కు వెళ్లిన మెడికోలకు ఎదురైన చేదు అనుభవం ఇది. 'స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్, ఎస్ఐ, సీఐ ఎవరూ లేరు. వారు వచ్చేవరకు ఆగండి.' అంటూ గంటల సమయం కాలయాపన చేశారు. అంతకముందు వైద్య విద్యార్థులు 112కు ఫోన్‌చేస్తే ఇది తెలంగాణా అంటూ చెప్పడంతో నివ్వెరబోయారు. చివరకు ఓ విద్యార్థి తన బంధువుతో సిఫారసు చేయించడంతో చోరీ జరిగిన ప్రదేశానికి అధికారులు వెళ్లి పరిశీలించారు. అయితే, ఇన్‌స్పెక్టర్ సెలవులో ఉండటంతో అనేక చర్చల తర్వాత రాత్రి కేసు నమోదు చేశారు.

నిద్రపోతుంటే దొంగిలించారు



రాత్రి చదువుకుని తెల్లవారిన తర్వాత నిద్రలోకి జారుకున్నాం. ఆ తర్వాత గుర్తుతెలియని వ్యక్తులు ల్యాప్‌టాప్‌లు, ఐ ఫోన్లు తీసుకెళ్లారు. ఇది గుర్తించి ఫోన్ సిగ్నల్ ఆధారంగా బుజబుజనెల్లూరు వరకు వెళ్లాము. ఆ తర్వాత ఫోన్ సిగ్నల్స్ ఆగిపోయాయి. పోలీసులకు ఫిర్యాదు చేశాము. హాస్టల్‌కు వచ్చే వారి పనే అయి ఉంటుందని అనుకుంటున్నాము. ఫోన్ పోవటం వల్ల కుటుంబ సభ్యులతో మాట్లాడే అవకాశం లేకుండా పోయింది.

- లక్షిత్ దీప్, బాధిత మెడికో

విచారణ చేపడుతున్నాం



బాయిస్ హాస్టల్‌లో చోరీపై పూర్తిస్థాయి విచారణ జరుగుతోంది. మెడికోలు పోలీసులకు ఫిర్యాదు చేశా రు. వాస్తవాలు త్వరలో బయటకు వస్తాయి. మెడి కోలు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. పనిచేయని కెమెరాలను బాగుచేస్తున్నాం.

- డాక్టర్ వసుంధరాదేవి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కాళంగిలో ఇసుక తరలిస్తే చర్యలు



కంచెను పరిశీలిస్తున్న తహసీల్దార్

సూళ్లూరుపేట, జూన్ 19: కాళంగి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కేవి గోపాలకృష్ణ హెచ్చరించారు. మండలంలోని ఇలుపూరు, మంగళంపాడుల నుంచి కాళంగిలో ఇసుకను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ చేసి రాత్రి సమయాల్లో పరిశ్రమలకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలిస్తున్నారు. దీనిపై గ్రామస్తులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆర్డీవో ఆదేశాల మేరకు తహసీల్దార్ బుధవారం ఆ ప్రాంతాలను పరిశీలించారు. కాళంగి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలించే మార్గాలను ఎక్స్‌కవేటర్ సాయంతో గుంతలు తవ్వి ముళ్లతో కంచె ఏర్పాటు చేశారు. గ్రామ పరిసరాల్లో ఉన్న ఇసుకను కూడా స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చే వరకు ఇసుకను తరలించరాదన్నారు. నిబంధలను పాటించకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

సాగరమాల పరిహారం కోసం రైతుల నిరసన

చిల్లకూరు, జూన్ 19: మండలంలోని ఉడ తావారిపార్లపల్లెకి చెందిన రైతులు సాగర మాల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన తమకు అధికారులు ఏలాంటి పరిహారం ఇవ్వలేదని బుధవారం భూముల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు లు మాట్లాడుతూ సుమారు 60 ఏళ్లుగా ప్రభు త్వం తమకు మంజూరు చేసిన భూమిలో సా గు చేసుకుంటున్నామన్నారు. అప్పట్లో తమకు డీకేటీ పట్టాలను మంజూరు చేసిందన్నారు. తమ గ్రామానికి సమీపంలో అటవీ ప్రాంతాన్ని చదును చేసుకుని సాగు చేసు కుంటున్నామన్నారు. అయితే ప్రస్తుతం తాము సాగు చేసుకుంటున్న భూముల్లో సాగరమాల రోడ్డు నిర్మాణం చేపడుతుండ డంతో భూమిని కోల్పోయామన్నారు. దీనిపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకో లేదన్నారు. భూములు కోల్పోయిన తమకు పరి హారం కానీ లేదా కొంత భూమిని మంజూరు చేయాలన్నారు.



పరిహారం కోసం ఆందోళన చేస్తున్న ఉడతావారిపార్లపల్లి రైతులు

అసెంబ్లీ సమావేశాల తర్వాత సమస్యలపై దృష్టి

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



వెంకటగిరి, జూన్ 19: అసెంబ్లీ సమావేశాల అనంతరం గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ చెప్పారు. బుధవారం రామకృష్ణను నెల్లూరు జిల్లా పంచాయతీ విస్తరణ అధికారి సుస్మితా రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి, నుడా ఏఈ హేమలత తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇకపై అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే రామకృష్ణను శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ ఛైర్మన్ చెంచయ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు సన్మానం



గూడూరు, జూ న్ 19: నియోజకవర్గ పరిధిలోని పలువురు నాయకులు, వివిధ అసోసి యేషన్ల, సంస్థల సభ్యులు బుధవారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో పాశిం సునీల్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలి పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తన గెలుపునకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అందరి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

టీడీపీ ప్రజాప్రతినిధులకు సత్కారం



సోమిరెడ్డిని సన్మానిస్తున్న సుధీర్, సుధీర్‌రెడ్డి తదితరులు

నాయుడుపేట, జూన్ 19: టీడీపీ ఎమ్మెల్యేలుగా ఘన విజయం సాధించిన ప్రజా ప్రతినిధులను బుధవారం తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు ఏ.సుధీర్, జి.సుధీర్ రెడ్డి సన్మానించి శుభాకాంక్షలు తెలి పారు. సర్వే పల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డిని, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను మర్యాదపూ ర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట టీడీపీ నాయకులు వెంపల్లి వెంకటేశ్వర్లు యాదవ్, సప్తగిరి, రాఘవరెడ్డి ఉన్నారు.